ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
ఆదివారం 22-02-2026 పేజీలు : 16



## కల్వకుర్తి ఏ డి ఏ కిరణ్ కుమార్ ఇళ్లపై

# ఏసీబీ దాడులు

గరిడేపల్లి ఫిబ్రవరి 22 విజన్ ఆంధ్ర : గరిడేపల్లి/నేరేడుచర్ల: అక్రమాస్తుల ఆరోపణల నేపథ్యంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ), సూర్యాపేట డీఆర్డీఏ మాజీ పీడీ కిరణ్ కుమార్ ఇళ్లలో ఏసీబీ అధికారులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. గరిడేపల్లి మండలంలోని ఆయన స్వగ్రామమైన పొనుగోడుతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.

ఏడు చోట్ల ఏకకాలంలో సోదాలు

మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో జరిగిన ఈ దాడుల్లో అధికారులు

3 పేజీలో...

# మహిళలకు ఉపాధి అవకాశాలు



కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలు ఏర్పాటు కు కృషి


-ఆందోల్ విద్య, వైద్య రంగాల హబ్ గా గుర్తింపు .

-ఆర్ ఆర్ డి డిస్టలరీ ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

2 పేజీలో...

## ఉపాధి హామీ కూలీల సమీకరణ ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి భాధ్యత

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



5 పేజీలో...

కొల్లాపూర్ డిగ్రీ కళాశాలలో

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

3 పేజీలో...

# గుట్టుగా గంజాయ్

## - గంజాయి మత్తులో యువత...



కారేపల్లి, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : యువత గంజాయికి బలవుతోంది.నిషేధిత గంజాయి నేడు యువతకు ఎంజాయ్ గా మారుతుంది.గంజాయిని సేవించడం వల్ల ప్రాణాలు గాల్లో కలిసి పోతాయని తెలిసినప్పటికీ గుట్టుగా ఈ మత్తుకు బానిసలు అవుతున్నారు.పాడుబడ్డభవనాలు, ముళ్లపొదలు, రహస్య స్థావరాలు గంజాయి పీల్చే ప్రధాన స్థావరాలుగా మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి సంఘటనే శనివారం కారేపల్లి గ్రామంలో వెలుగు చూసింది.హుక్కా పీల్చే విధంగా ప్రత్యేక బాటిల్లను ఏర్పాటు చేసుకొని వాటి సహాయంతో రహస్య ప్రాంతాల్లో గంజాయిని పీల్చుతూ యువత మత్తులో తూలుతున్నారు.స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో ఈ హుక్కా బాటిళ్ళు కనిపించడంతో యువత బహిరంగంగానే గంజాయిని వినియోగిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గంజాయి పొట్లాలు, హుక్క పీల్చే మాదిరిగా తయారుచేసిన బాటిల్లు ముళ్లపొదల్లో లభ్యమవడంతో మండలంలో గంజాయి విక్రయాలు అధికంగానే ఉన్నాయని యువత గంజాయిని విరివిగా వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది.గంజాయి మత్తుకు బానిసైన యువత చేజేతులారా బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారనీ, చాప కింద నీరులా సాగుతున్న నిషేధిత గంజాయి వినియోగం పై పోలీసులు గట్టి నిగాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనీ పలువురు పోలీస్ యంత్రాంగాన్ని కోరుతున్నారు.

## ప్లే స్కూల్స్ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెంపొందాలి

బచ్పన్ రైమ్స్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద --

విద్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సూచన

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): చిన్నారులకు వినోదాత్మక విద్య అందించడం ద్వారా వారి సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పేర్కొన్నారు. శనివారం జీహెచ్ఎంసీ పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ, నార్త్ ఎన్సీఎల్ కాలనీలో ఉన్న బచ్పన్ రైమ్స్ స్కూల్లో నిర్వహించిన "స్కూల్ అన్యువల్ డే" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా



10 పేజీలో...

శ్రీ లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాలకు

# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

14 పేజీలో...

- భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి
-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల ఆర్ సి ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర) : తేది 27.02.2026 నుండి 11.03.2026 వరకు జరగనున్న శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశంకు శనివారం ముఖ్యఅతిథిగా ధర్మపురిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పాల్గొన్నారు.ధర్మపురిలోని ప్రతిష్టాత్మక క్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం లో జరిగే బ్రహ్మోత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని అందుకు అధికారులు అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.



# కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

మల్యాల. ఫిబ్రవరి 21( విజన్ ఆంధ్ర ): మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి తెల్లవారుజామున నాలుగు గంటల నుండి క్యూ లైన్ లో వేచి ఉన్నారు. సాధారణ రోజుల కన్నా శనివారం కావడంతో ఆలయంలో రద్దీ ఎక్కువగా దృష్ట్యా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**గంభీరావుపేటలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన సందర్భంగా**

# పటిష్ట భద్రత ఏర్పాట్లు

**-జిల్లా ఎస్పీ. మహేష్ బి. గీతే**



గంభీరావుపేట ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : గంభీరవుపేట మండలంలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల బృందం ఆదివారం రోజున పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన దృష్ట్యా గంభీరవుపేట మండలంలో ఏర్పాట్లను,హెలిప్యాడ్‌ను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ అనిల్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దమ్మన్న పేటలో ఉచిత వైద్య శిబిరం

గంభీరావుపేట ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర):గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో దమ్మన్నపేటలో గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నాలుగో రోజులో భాగంగా ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పాక ధర్మపురి ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ వారి సౌజన్యంతో శనివారం ఈరోజు దమ్మన్నపేట గ్రామ ప్రజలకు మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ దుంపల చంద్రశేఖర్ రెడ్డి గారి సమక్షంలో ప్రారంభించడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రతిమ ఫౌండేషన్ వారు జనరల్ మెడిసిన్- డాక్టర్ శ్రీకర్, జనరల్ సర్జన్- డాక్టర్. కే నవ్య, ఆప్తమాలజీ- డాక్టర్. శివాని, ఎముకలకు మరియు కీళ్లనొప్పులకు- డాక్టర్. వరుణ్, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు- డాక్టర్. తేజశ్రీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న గ్రామ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు సుమారు 250 మందికిపైగా వైద్య సేవలు నిర్వహించి, ఉచిత మందుల పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ గారికి, ప్రతిమ ఫౌండేషన్ వారికి గ్రామ సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి అమిత్ ఫాషా, ప్రతి మా ఫౌండేషన్ మేనేజర్ వంగ గీతారెడ్డి , వివిధ విభాగాల కు చెందిన డాక్టర్లు, మరియు , వార్డ్ మెంబర్లు, గ్రామ కార్యదర్శి, కళాశాల అధ్యాపక బృందం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో ఘనంగా సేవాలాల్ వేడుకలు

కారేపల్లి,ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : బంజారాల ఆరాధ్య దైవం,అఖండ బాల బ్రహ్మచారి శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలు కారేపల్లి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. శనివారం స్థానిక ఐకెపి కార్యాలయం పక్కన మండల తాసిల్దార్ రమేష్ ఆధ్వర్యంలో బోగ్ బండారో,సేవాలాల్ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,అదనపు కలెక్టర్ శ్రీజ, లంబాడి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి తమ హక్కులను సాధించుకున్న గొప్ప నేత, సంఘసంస్కర్త సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. నిజాయితీ శ్రమ సేవా భావాని కలిగి జాతి ఐక్యతను ఉన్నత లక్ష్యాల వైపు యువత పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో



మండల సర్పంచులు బానోత్ హిరాలాల్,మేదరి టోనీ,మాజీ జెడ్పిటిసి బానోత్ దేవ్లా,సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,మహిళా నాయకురాలు పగడాల మంజుల,ఎంపీట మల్లెల రవీంద్ర ప్రసాద్,సీఐ సాగర్,ఎస్సై బైరు గోపి వివిధ శాఖల అధికారులతో పాటు,అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు,పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ఏ డి ఏ కిరణ్ కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు

కీలక సమాచారాన్ని సేకరించారు.

- పొనుగోడు: కిరణ్ కుమార్ స్వగృహంలో తెల్లవారుజాము నుంచే అధికారులు తనిఖీలు చేపట్టారు. నేరేడుచర్ల: పట్టణ కేంద్రంలోని అవని రైస్ మిల్లుతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు కొనసాగాయి. మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహించినట్లు అధికారులు ధృవీకరించారు.

ఆదాయానికి మించిన ఆస్తులే లక్ష్యంగా..

గతంలో సూర్యాపేట జిల్లా డీఆర్డీఏ పీడీగా పనిచేసిన కాలంలో కిరణ్ కుమార్ భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వద్ద ఉన్న ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, బ్యాంకు నిల్వలు, ఇతర విలువైన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. "ఆదాయానికి మించిన ఆస్తుల కలిగి ఉన్నారనే ప్రాథమిక సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నాం. ఆస్తులకు సంబంధించిన వివరణలను అడుగుతున్నాం. కీలక పత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తాం."

--- ఏసీబీ డీఎస్పీ, మహబూబ్ నగర్.

ప్రస్తుతం సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న నగదు లేదా పత్రాల వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఈ దాడుల వార్త స్థానికంగా మరియు ప్రభుత్వ అధికారుల వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# కొల్లాపూర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

**- తెలుగు భాష గొప్పతనాన్ని సమాజానికి చాటి చెప్పాలి**

**- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్**

**- మాతృభాష దినోత్సవం రోజు డిగ్రీ కళాశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు రచించిన పుస్తక ఆవిష్కరణ**

కొల్లాపూర్ ఫిబ్రవరి 21 : (విజన్ ఆంధ్ర) : ఫిబ్రవరి 21 ప్రపంచ అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఉన్న డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, అమ్మ ఒడి ఎంత చల్లనైనదో మన బడిలో నేర్చుకున్న తెలుగు మాతృభాష అంత కమ్మనైనది అని కొల్లాపూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ అన్నారు. మనం ఎన్ని భాషలు నేర్చుకున్న ఎన్ని బంధాలను కలుపుకున్న మాతృభాష పేగు బంధం అంత పవిత్రం మరి ఏది ఉండదని, మాతృభాష గొప్పతనం గురించి తన ప్రసంగం ద్వారా చాటి చెప్తూ తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల్లి తనకు పుట్టబోయే బిడ్డ సమాజంలో గౌరవపదంగా జీవించాలని తన బిడ్డకు తనకు వచ్చిన అక్షరాలను తెలుగుభాషను తన చేతుల సైగలతో మాటలతో చక్కగా నేర్పిస్తూ అంచలంచలుగా తీర్చి దిద్దుతుంది అలా పిల్లలతో వారి అడుగులో అడుగు కలిపి మాటలో మాటలను కలిపి తెలుగు అక్షరాలను గురువుల కంటే ముందు మనకు జన్మనిచ్చిన మాతృమూర్తి మొదటి గురువుగా తన పిల్లలకు అక్షరాలను పరిచయం చేస్తూ సమాజంలో ఎలా మెలగాలి



అనే విషయాన్ని పిల్లలకు చక్కగా వివరిస్తూ నేర్పిస్తుంది అలాంటి అమ్మ దినోత్సవాన్ని ప్రపంచ మాతృభాష దినోత్సవంగా మనమందరం జరుపుకుంటున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. తన పిల్లలను విద్యాభ్యాసం కోసం పాఠశాలకు పంపించినప్పుడు గురువులు నేర్పిన తెలుగు భాషను విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో పాటు చక్కటి తెలుగు భాషాభావంతో సమాజంలో ఎలా మెలగాలని విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం గురించి తెలుగు మాట్లాడే విధానం గురించి గురువులు నేర్పిస్తుంటారు. అలా ఉపాధ్యాయులతో తల్లిదండ్రులతో నేర్చుకున్న విద్యార్థులు అంచలంచలుగా ఎదుగుతూ సమాజంలో తెలుగు భాష గొప్పతనాన్ని వాడుక భాషగా నిరంతరం మార్చుకొని మాట్లాడుతూ భాష గొప్పదనం గురించి సమాజానికి వివరించాలని. విద్యార్థులు చక్కటి నడవడికతో మంచి ఉన్నత శిఖరంలో ఎదిగిన రోజు ఆ ఆనందం తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆనందిస్తారు అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ అన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు రచించిన పుస్తకాన్ని కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల సమక్షంలో మాతృభాష దినోత్సవం రోజు స్టేజిపై ప్రిన్సిపల్ చేతుల మీదుగా పుస్తకాన్ని రచించిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచించిన ఆంగ్ల ఉపాధ్యాయిని స్టేజిపై గౌరవంగా శాలువా తో కళాశాల ప్రిన్సిపాల్ సత్కరించి అభినందించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనం గురించి చక్కటి ఉపన్యాసాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అలాగే ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లీష్ తప్పనిసరి అని ఆయన విద్యార్థులకు సూచించారు. తన తల్లిపై ఉన్న ప్రేమాభిమానాన్ని ఒక పాట రూపకంగా స్టేజిపై పాటను పాటి వినిపించి మాతృమూర్తి గొప్పతనాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ కు ఘన సత్కారం...

బోధన్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : బోధన్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి ని ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్ పర్సన్‌గా రెండవ సారి ఎన్నికైన సందర్బంగా పట్టణంలోని ఆమె నివాసంలో చైర్ పర్సన్ దంపతులు తూము పద్మ శరత్ రెడ్డి లను శనివారం ప్రింట్ మీడియా అధ్యక్షులు కారం స్వామి ఆధ్వర్యంలో ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు రాజేష్, గౌరవ అధ్యక్షులు బలరాం రాజు, రవి, వినాయక్ రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## భవ్య భారత నిర్మాణానికి యువత కృషి చేయాలి

### ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాల ఆత్మీయ కలయికలో అన్నదానం సుబ్రమణ్యం



మిర్యాలగూడ, ఫిబ్రవరి 21( విజన్ ఆంధ్ర) : భారత దేశంలో హిందుత్వ భావాలను పెంపొందించి భారతదేశ సమగ్రతను కాపాడుకోవాలని భవ్య భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకరిణి సభ్యులు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆర్ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రముఖుల ఆత్మీయ సభను నల్గొండ జిల్లా మిర్యాలగూడ లోని ఎం.వి.ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత దేశ ఔన్నత్యం చూసి ఆశ్చర్యపోతున్నాయని ప్రతి దేశం భారతదేశం లాగా ఉండాలని ఇక్కడి సాంప్రదాయాలను సైతం ఆచరించాలని భావించడం చాలా గొప్ప విషయం అన్నారు. దశాబ్దాలకు ఈ దేశ ఐక్యమత్యాన్ని దెబ్బతీసేందుకు ముష్కరులు ప్రయత్నం చేసినప్పటికీ ఐక్యమత్యంతో ఓర్పు సహనముతో వాటిని ఎదుర్కొని ఈ దేశ సమరసతను కాపాడుకుందాం అన్నారు. ఇంకను సమగ్ర భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ స్వయంసేవకులుగా మారి దేశ సేవలో తమ భాగస్వామ్యాన్ని అందించాలన్నారు. స్వయం సేవకులు గా మారే ప్రతి ఒక్కరూ సైనికుడేనని గుర్తుర‌గాలని, ఈ దేశం కోసం మనం కొంత నైనా సేవా భావాన్ని చూపెట్టాలని ఈ దేశం మనకేమిచ్చింది అనేది కాకుండా ఈ దేశం కోసం మనం ఏం చేశాము అని ధోరణితో ముందుకు సాగాలని అప్పుడే భవ్య భారత నిర్మాణాన్ని నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు గార్లపాటి వెంకటయ్య, అద్దంకి శ్రీనివాసరావు, మంత్రి ప్రగడ శ్రీధర్ రావు, గూడూరు శ్రీనివాసరావు, ఘంట సంతోష్ రెడ్డి, చెరువుపల్లి కరుణాకర్, ప్రీతమ్ రాజు, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృభాష దినోత్సవం



గంభీరావుపేట ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) గంభీరావుపేట మండలం లింగన్న పేట గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మాతృభాష యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ తెలుగు పాఠ్యాంశాల పై చక్కని క్విజ్ ను ఏర్పాటు చేసి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు ఎస్. గంగారాం , తెలుగు ఉపాధ్యాయులు మం.నరేందర్,కె రాజయ్య లు మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి నీటి సమస్యల నివారణకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్...

### బంధనకల్ గ్రామంలో అధికారుల విస్తృత పరిశీలన



విజన్ ఆంధ్ర, ముస్తాబాద్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామంలో శనివారం రోజున వేసవి కాలంలో తలెత్తే నీటి ఎద్దడి సమస్యలను ముందుగానే నివారించేందుకు "సమ్మర్ స్పెషల్ డ్రైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల భాగంగా అధికారులు గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ నీటి సరఫరా పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామంలోని గల్లీ గల్లీ తిరుగుతూ ఎక్కడ నీటి సమస్యలు ఉన్నాయో గుర్తించి, కొత్త లైన్ల ఏర్పాటు అవసరమున్న ప్రాంతాలను నమోదు చేశారు. అలాగే ఇప్పటికే ఉన్న పైపులైన్లలో లీకేజీలు, దెబ్బతిన్న భాగాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి వృథాను నివారించడం ద్వారా ప్రతి ఇంటికి సమయానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.వేసవి కాలంలో నీటి కొరత రాకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించడం ముఖ్యమని గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవ్య, డిఈ పావని, ఏఈ దివ్య, వాటర్ మెన్ కారోబార్ సాయి, గ్రామ ప్రజలు మరియు సిబ్బంది పాల్గొని సమస్యలపై వివరాలు సేకరించారు. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచేందుకు త్వరలోనే అవసరమైన పనులు చేపడతామని అధికారులు తెలిపారు.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన ఈ సమ్మర్ స్పెషల్ డ్రైవ్ గ్రామ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి



మహబూబాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 21,(విజన్ ఆంధ్ర) : మహబూబాబాద్ జిల్లాలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్ (46) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. శంకర్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం ఉదయం అస్వస్థతకు గురైన శంకర్ ను కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. శంకర్ మృతి చెందిన వార్త తెలియడం తో గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గత 9 ఏళ్లుగా ఉపాధ్యాయులు గా సేవలు అందించిన శంకర్ ప్రస్తుతం వేమునూరు శివారు ఉత్తర తండా పాఠశాలలో సేవలందిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన అకాల మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి చేరింది. ప్రభుత్వం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రామోజీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన-సీమంతం కార్యక్రమాలు



పెద్ద శంకరంపేట్: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ మండలం రామోజీపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అన్నప్రాసన, సీమంతం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు, గర్భిణీ స్త్రీల శ్రేయస్సు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా తల్లులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీశైల హాజరై మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వార్డ్ సభ్యులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించగా, గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి ఆశీర్వదించారు. పిల్లల తల్లులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగాపాల్గొన్నారు. అనంతరం ఏఎల్ఎంసీ కమిటీని సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. అంగన్‌వాడీ విధి నియమాలను పరిశీలించడం, కేంద్రం పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను ఈ కమిటీ వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కవిత, హేమలత గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రింట్ మీడియా అధ్యక్షులు కారం స్వామికి ఘన సత్కారం...

బోధన్,ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర):బోధన్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో అధ్యక్షులు కారం స్వామి కి ఘనంగా సత్కరించారు. ఇటీవలే ప్రింట్ మీడియా అధ్యక్షులుగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్బంగా ఆయనకు శనివారం పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు రాజేష్, గౌరవ అధ్యక్షులు బలరాం రాజు, రవి, వినాయక్ రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# బాన్సువాడలో స్వచ్ఛందంగా బందు పాటించిన వ్యాపారస్తులు

**బాన్సువాడ లో 144 సెక్షన్ అమలు....**

**బాన్సువాడ లో భారీ పోలీసు బందోబస్తు......**

**స్వచ్ఛందం గా మూసి ఉంచిన షాపులు.......**

బాన్సువాడ ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర). బాన్సువాడ పట్టణం లో హిందూ సంఘాల ఆధ్వర్యం లో బంద్ ప్రశాంతం గా నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలో స్వల్ప వివాదం కాస్త ఉద్రిక్తకు దారితీసింది. శుక్రవారం సాయంత్రం రిలయన్స్ స్మార్ట్ షో రూమ్ లో పనిచేస్తున్న ఓ మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యం గా మాట్లాడారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం తో ఇరువార్గాలు ఆందోళనకు దిగారు. బాన్సువాడ లో 144 సెక్షన్ అమల్లో ఉంది. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పోలీస్ పహారాల్లో బాన్సువాడ పట్టణం ఉంది, దీంతో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బాన్సువాడ కు చేరుకొని ఇరువు వర్గాల ఆందోళన ను వీర మింపచేసి శాంతింప చేశారు. బాన్సువాడ హిందూ సంఘాల ఆధ్వర్యం లో శనివారం స్వచ్ఛందం గా బందు పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

బాన్సువాడ సంఘటన పట్ల స్పందించిన నాయకులు.......

బాన్సువాడ లో జరిగిన సంఘటన పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, స్పందించి ఆ ఘటనకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అని తెలిపారు. అదేవిధంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బాన్సువాడకు వస్తున్నట్లు తెల్చుకున్న పోలీసులు మార్గమధ్యంలో నే ఆయన ను అడగించి అరెస్టు చేసి ఎమ్మెల్యే బాన్సువాడ కు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.

# ఉపాధి హామీ కూలీల సమీకరణ ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి భాధ్యత

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21,(విజన్ ఆంధ్ర) : ఉపాధి హామీ కూలీల సమీకరణ ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి భాధ్యత అని ఈ విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.జిల్లాలో అమలవుతున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ప్రగతి పై శనివారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ లక్ష్యము సాధించడంలో వెనుకబడిన మండలాలు వారం రోజులలోపు ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అన్ని గ్రామాలలో నిర్వహించబడుతున్న నర్సరీ లలో 100% బ్యాగ్ ఫిల్లింగ్ మరియు విత్తనాల డిబ్లింగ్ జరగాలని ఈ విషయంలో సంబంధిత మండల పంచాయతీ అధికారి మరియు మండల పరిషత్ అధికారి మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తగు శ్రద్ధ వహించాలని అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరి చేయబడి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టబడిన పనులన్నీ వెంటనే మొదలుపెట్టాలని మరియు ఇప్పటికే పూర్తయిన పనులన్నింటినీ ఆన్లైన్లో కంప్లీట్ అని చూపించాలని అందరూ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లను ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లను మరియు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ అధికారి నిర్వాహక ఇంజనీర్లు సహాయ కార్యనిర్వాయక ఇంజనీర్ మండలాల నుండి ప్రోగ్రాం అధికారులు మండల అభివృద్ధి అధికారి మండల పంచాయతీ అధికారులు మరియు అదనపు ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నపేట పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

గరిడేపల్లి, ఫిబ్రవరి 22 విజన్ ఆంధ్ర : గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. సతీష్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో, ప్రముఖ దాతలు పోలిశెట్టి జనార్దన్ రావు – కవిత దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించ బడింది. రాబోయే గురుకుల ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి పరీక్ష ప్యాడ్లు మరియు పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారికి అండగా నిలుస్తున్న దాతలను మరియు సతీష్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: పాఠశాల ఉపాధ్యాయులు: బి. వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి



సతీష్ మ్యూజిక్ అకాడమీ సభ్యులు: అమరవరపు గిరి, పేరూపాగు మహేష్, పాఠశాల విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది.

# ఆపదలో అండగా నిలిచిన గ్రామ యువత – దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం



తుంగతుర్తి, ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర ) : పేదరికంలో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు గ్రామ యువత ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మడిపెద్ది మధు తనవంతుగా రూ. 5,000 ఆర్థిక సహాయం అందించి దహన కార్యక్రమాలు సజావుగా జరిగేలా సహకరించారు. అదేవిధంగా వెంపటి గ్రామ వాట్సాప్ గ్రూపులో సమాచారం అం దించగా గ్రామ యువత తమకు తోచినంతగా ఆర్థిక సహాయం అందించి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు దాతలు మరియు యువతను అభినందిస్తూ, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం నిజమైన మానవత్వమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. గ్రామంలో ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఈ ఘటన అందరికీ స్ఫూర్తిదాయకంగా మారింది.

# కాటమయ్య రక్ష కవచ కిట్టుపై శిక్షణ

పెన్ పహాడ్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలోని సత్య గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో పెన్ పహాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గౌడ వృత్తి దారులకు కాటమయ్య రక్షా కవచ్ కిట్ గురించి శిక్షణ అందజేశారు. ఈ ట్రైనింగ్ లో తాటి చెట్టు పైనుండి ప్రమాదవశాత్తు జారిక్రిందపడి మరణించకుండా శాశ్వత అంగవైకల్యం మొదలగు ప్రమాదాలు జరగకుండా ట్రైనింగ్ ఇచ్చి వారికి కాటమయ్య రక్షణ కావచ్ కిట్లను అందజేస్తామని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సురేందర్ బెనర్జీ, సిబ్బంది అనిల్, నర్మదా, బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఉపేందర్ రెడ్డి, వంశి , గౌడ కుల సంఘాల నాయకులు మామిడి సైదులు, దండంపల్లి సైదులు, చామకూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మానసిక ఆరోగ్యానికి పోలీసుల అండ

**-యువకుడిని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చేర్పించిన జీడిమెట్ల పోలీసులు**

**-తల్లిదండ్రుల విజ్ఞప్తిపై తక్షణ స్పందన**

**- సమాజ సమస్యల పరిష్కారంలో పోలీసుల బాధ్యతాభావం**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): ప్రజలకు చేరువగా ఉండే విధానానికి నిదర్శనంగా జీడిమెట్ల పోలీసులు మరో మానవతా కార్యక్రమాన్ని చేపట్టారు. మానసిక సమస్యలతో బాధపడుతూ కుటుంబ సభ్యులు, కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్న 26 సంవత్సరాల యువకుడిని అతని తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో చేర్పించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని శాపూర్‌నగర్ సంజయ్ గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన అభిషేక్ దాస్ (26) కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఉపాధి లేక ఇంటి వద్దే ఉంటున్న అతడు ఇటీవల కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తుండగా, తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను గౌరవించిన పోలీసులు ముందుగా యువకుడికి మార్గదర్శక చర్చ నిర్వహించారు. అనంతరం పోలీసు వాహనంలో అతడిని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు చేర్పించారు. అతనికి సముచితమైన చికిత్స అందించి త్వరితగతిన సాధారణ స్థితికి తీసుకురావాలని వైద్య బృందాన్ని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పోలీసులు కేవలం నేరాల నమోదు, దర్యాప్తుకే పరిమితం కాకుండా సమాజంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కూడా భాగస్వాములవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృషి చేస్తున్నామని తెలిపారు. జీడిమెట్ల పోలీసుల ఈ చర్యకు స్థానికులు అభినందనలు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మానసిక ఆరోగ్యంపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.





## నేటితో మల్లన్న జాతర సురు

ఇచ్చోడ ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో ఈనెల 22 నుంచి శ్రీ మల్లికార్జున స్వామి జాతర ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు సోమశేఖర్, మహేశ్ శనివారం తెలియజేశారు. ఏడు రోజుల పాటు కొనసాగుతున్న జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి మల్లన్నను దర్శించుకుంటారని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



పాపన్నపేట ఫిబ్రవరి 21, విజన్ ఆంధ్ర: పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్ నాగరాజు నర్సింలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు 'మాతృభాషలోనే మాట్లాడుకుందాం' అనే అంశంపై ఎలాంటి ఇతర భాషా పదాలు వాడకుండా తెలుగులో ఉపన్యాస పోటీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ మాట్లాడుతూ మాతృభాషలోనే అన్ని రంగాలలో రాణిస్తారని ఇతర భాషలపై పట్టు సాధిస్తారని అన్నారు. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ ,కృష్ణ కాం త్ ,యాదయ్య ,నింగప్ప, వేణుగోపాల్ రెడ్డి ,ఇందిర, పద్మ, లక్ష్మి ,రజిత, సుభాష్,శ్రీనివాస్ మహమూద్, ,నందిని పాల్గొన్నారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

### - బీసీ జేఏసీ డిమాండ్

జహీరాబాద్ ఫిబ్రవరి 21 (విజనఆంధ్ర) : త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని బీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను గుర్తు చేసుకుంటూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని ఆరోపించారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందని, కనీసం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అయినా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు కొండాపురం నర్సింలు, చైర్మన్ డాక్టర్ పెద్దగొల్ల నారాయణ, కార్యదర్శి శంకర్ సాగర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఇమ్రాన్, నాయకులు మోహన్, గోపాల్, శ్రీకాంత్, బాలకృష్ణ, శివ మాదినం తదితరులు పాల్గొన్నారు.



## బాన్సువాడకు బయలుదేరిన ఎండల లక్ష్మీనారాయణ ను మధ్యలో అరెస్టు చేసి పోలీసులు

### బికనూరు పోలీస్ స్టేషన్ లో నిర్భందించిన పోలీసులు.......



బాన్సువాడ ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర). బాన్సువాడ కు బయలుదేరిన ఎండల లక్ష్మీనారాయణ ను శనివారం మార్గమధ్యలో అరెస్టు చేసి స్టేషన్ లో నిర్వహించిన బిక్కనూరు పోలీసులు. బాన్సువాడ పట్టణం లో నిన్న జరిగిన ఘర్షణల నేపథ్యం లో గాయపడిన కార్యకర్తల ను మరియు ఒక మతోన్మాది చేతి లో దాడికి గురైన హిందూ యువతి ని పరామర్శించేందు కు బాన్సువాడ బయలుదేరిన బిజెపి మాజీ శాసనసభ పక్ష నేత, బాన్స్వాడ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎండల లక్ష్మీనారాయణ ను మార్గమధ్యం లో భిక్కనూరు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ముస్లిం అరాచకాలు పెట్రేగిపోయాయని, అడుగడుగునా హిందువుల ను ఇబ్బందుల కు గురి చేస్తూ ముస్లిం లు అరాచకాలకు పాల్పడుతున్నారని, పోలీసులు కూడా బాధితుల పక్షాన నిలువ కుండా రాజకీయ ఒత్తిడి కి తలొగ్గి బాధితుల పైనే అక్రమంగా వేధింపుల కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు వ్యాపార సంస్థ లో పూజ చేసిన అనంతరం దేవుడి పాటలు పెట్టినందు కు హిందూ యువతి మీద దుర్భాషలాడుతూ దాడికి పాలు పడ్డ దుండగుడి ని వెంటనే అరెస్టు చేసి నిర్భయ కేసును హత్యాయత్నం కేసును నమోదు చేయాలని, నిందితుడి ని అత్యంత కఠినం గా శిక్షించాలని లేని పక్షం లో బాన్సువాడ నియోజకవర్గ మొత్తం ఎక్కడి కక్కడ నిరసన లు పెళ్ళుబుకుతాయని ఆయన పోలీసుల ను హెచ్చరించారు.

## అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసిన.. నీలికుర్తి గ్రామ సర్పంచ్ తోట్టి గౌతం..



మరిపెడ, విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని నీలికుర్తి గ్రామంలోని అంగన్ వాడి 1, 2 కేంద్రాలను సర్పంచ్ తోట్టి గౌతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలోని రికార్డులు,స్టాక్ రిజిష్టర్లు తనిఖీ చేశారు. గర్భిణులు,బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం,ఎంతమంది పిల్లలు ఉన్నారు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.అలాగే పోషకాహారం పంపిణీ విధానం,పరిశుభ్రత,మౌలిక వసతులు,కేంద్రంలో చిన్నారులకు కుర్చీలు, ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని చిన్నారుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీలికుర్తి సర్పంచ్ తోట్టి గౌతం మాట్లాడుతూ.. పిల్లలకు అక్షర జ్ఞానంతో పాటు ఆట, పాటలు నేర్పించాలన్నారు. చిన్నారులకు పూర్వ విద్యతో పాటు శారీరక మానసిక ఎదుగుదలకు దోహదపడే బలవర్ధకమైన ఆహారం వడ్డించాలన్నారు. ప్రభుత్వం నుండి సరఫరా చేసే బాలామృతంతో పాటు మంచి పౌష్టికాహారం అందజేయడంతో పాటు విద్యార్థుల బరువుఎత్తు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రభుత్వం చిన్నారుల ఎదుగుదలకు మంచి పౌష్టిక ఆహారం అందిస్తుందని, వాటితో పిల్లల ఆరోగ్యాలు మెరుగుపరుస్తాయని అన్నారు. పిల్లలను ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రతిరోజూ అంగన్ వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.చిన్నారుల ఆరోగ్యం,విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాధిక,అంగన్వాడి టీచర్స్ తోట్టి అరుణ,అంగడి శిరీష,గ్రామస్తులు కుమార్, పాక శరత్ తదితరులు పాల్గొన్నారు.

## డివైన్ మెర్సీ విద్యాలయంలో ఘనంగా 15వ వార్షికోత్సవ వేడుకలు.

### -పట్టణ పాఠశాలలకు ధీటుగా విద్య బోధన.....
### -విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి నిమిషం కృషి
### -ఉపాధ్యాయుల కృషి అభినందనీయం.......





నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి21(విజన్ ఆంధ్ర); పెద్దవూర మండలంలోని తుమ్మచెట్టు ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న డివైన్ మెర్సీ పాఠశాలలో 15వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ఢప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ ఆంథోనియర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రేవ.డాక్టర్ మ్యాథ్యూ కాల్లికట్ సుపీరియర్ జనరల్ ఆఫ్ హెచ్.జి.ఎన్,రేవ.ఫాదర్ హేర్మన్స్ రాజ్ ప్రొవిన్షియల్ సుపీరియర్ ఆఫ్ అపోస్తల్స్ ప్రావిన్స్(హెచ్.జి.ఎన్) ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా డివైన్ మెర్సీ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడంలో పురోగతిని సాధిస్తున్నామని అన్నారు.పట్టణ ప్రాంత పాఠశాలల ధీటుగా విద్యను అందిస్తున్నామని అందుకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని అన్నారు.విద్యార్థుల క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు.పదో తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత చదువు యొక్క ఆవశ్యకతను మంచిగా చదువుకొని ఉన్నత రంగాలలో రాణించాలని అన్నారు.ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఉన్నత ఉద్యోగ స్థాయిలో డాక్టర్లుగా ఉపాధ్యాయులుగా ఐఐటి కాలేజీలలో ఉన్నత చదువులు చదువుకొని మంచి రంగాలలో రాణించాలని ఆయన వారు తెలిపారు.అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సైన్స ఫెయిర్ సందర్శకులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో వివిధ ఫాదర్లు,ఉపాధ్యాయినీఢఉపాధ్యాయులు,విద్యార్థినిఢవిద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి అందజేసిన పోలీసులు

సంగెం ఫిబ్రవరి 21 విజన్ ఆంధ్ర : మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఎనబోతుల సదయ్య అనే వ్యక్తి నవంబర్ 2005 న సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేయడం జరిగింది. గత వారం రోజుల కిందట సిమ్ వేసి వాడటానికి ట్రై చేశారు. వెంటనే సిఈఐఆర్ ద్వారా అలర్ట్ రావడం జరిగింది. దొరికిన ఫోన్ ను ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో బాధితుడు సదయ్యకు శనివారం అప్పగించారు. ఇప్పటివరకు సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలో 186 సెల్ ఫోన్లు పోగొట్టుకోవడం జరిగింది. అందులో 150 ట్రేస్ చేసి పోగొట్టుకున్న బాధితులకు అందజేయడం జరిగింది. వెంటనే స్పందించి ఫోన్ తిరిగి వచ్చేలా చేసిన సిఈఐఆర్ పోర్టల్ చూస్తున్న కానిస్టేబుల్ నవీన్ ను, ఎస్సై వంశీకృష్ణ కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. ఎవరైనా సెల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్సై వంశీకృష్ణ సూచించారు.

# బీసీల రాజ్యాధికారమే మా లక్ష్యం..

**మహబూబాబాద్ నుంచి టిఆర్పి జెండా ప్రతి గ్రామంలో ఎగురవేస్తాం..**

**మహబూబాబాద్ జిల్లా నుండి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు..**



మరిపెడ (దంతాలపల్లి) విజన్ ఆంధ్ర : తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టి ఆర్ పి )రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో మహబూబాబాద్ జిల్లా నుండి కొండా వెంకన్న,ఊడుగుల ఐలయ్య, పులిగుజ్జు రామ్మూర్తి ముదిరాజ్,రాజేష్ యాదవ్, రాజేష్ ముదిరాజ్ పలువురు నాయకులు,కార్యకర్తలు ఘనంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా పార్టీ కండువా కప్పి కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ఇంతకాలం ఇతర పార్టీలలో సేవలందించినప్పటికీ, బీసీల హక్కుల కోసం నిబద్ధతతో పోరాడుతున్న మన బీసీ పార్టీ అయిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై చేరుతున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో గ్రామ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాటం మరింత వేగవంతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు,జిల్లా నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, టి ఆర్ పి పార్టీ బలోపేతానికి మహబూబాబాద్ జిల్లా నుండి బలమైన అడుగు పడిందని నాయకులు తెలిపారు.

# రాత్రి పగలు తేడా లేకుండా కోతులతో నరకం అనుభవిస్తున్న పట్టణ ప్రజలు

**వీధుల్లో దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు**

**స్థానిక మంత్రి పొన్నం అధికారులు పట్టించుకోవాలని ప్రజల వినతి**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఫిబ్రవరి 21 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణములో కోతులతో పట్టణ ప్రజలు తీవ్ర నరకం అనుభవిస్తున్నారు. ఈ సందర్భంగా కోతులు రాత్రి పగలు అని తేడా లేకుండా ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఇరవై వార్డులుండగా ప్రతి వార్డులోని ప్రతి గల్లీ గల్లీలో ఉదయం లేవడంతోనే మొదలు రాత్రి కూడా కోతులు ఇండ్లల్లోకి రావడం ఇంట్లో ప్రతి వస్తువులు వంట పాత్రలు వంట సామాగ్రి ఎత్తుకుపోతున్నాయి. పిల్లలు వృద్ధులు వికలాంగుల మీదికి కోతులు ఎగపడుతూ వస్తున్నాయి. తీవ్రగాయల పాలు చేస్తున్నాయి. రేకుల ఇండ్లల్లో కోతుల మంద మొత్తం రేకులు ఉడదిస్తున్నాయని గునేపెంకుల ఇళ్లలో పెంకులు మొత్తం తీసి బయట పడేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ అధికారులు



చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా కోతులు పట్టణ ప్రజలకు తీవ్ర నరకం చూపిస్తున్నాయని పాఠశాల, కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలకు వెళ్లే మహిళలు రోడ్లపై నడవాలంటే బయటికి వెళ్లాలంటే భయపడుతున్నారని, వృద్ధులు వికలాంగులు రోడ్డు మీదకి రావాలంటే కోతులతో ఇబ్బంది పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు తీవ్ర స్వరంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని పట్టణంలో కోతుల బెడద నుంచి తప్పించాలని ప్రజలు కోరుతున్నారు. హుస్నాబాద్ పట్టణములో విధి కుక్కలతో విద్యార్థులు వృద్దులు ఇబ్బంది పడుతున్నారని కొన్ని సందర్భాల్లో విధి కుక్కలు గాయపరుస్తున్నాయని ప్రజలు తెలిపారు.

నూతన పాలకవర్గం కోతుల వీధి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలి

హుస్నాబాద్ పట్టణంలో గత పాలక వర్గం కోతుల నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని నూతన పాలకవర్గం అయిన కోతుల మరియు విధి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈసారి మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కొందరు కౌన్సిలర్ అభ్యర్థులు కోతుల నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మేనిఫెస్టో కూడా సొంతంగా ప్రకటించారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. కోతులతో విధి కుక్కలతో అన్ని వాటిలో ఇబ్బంది పడుతున్నారని, పాఠశాలకు వెళ్లి చిన్న చిన్న విద్యార్థులు వృద్దులు వెల్తుంటే కుక్కలు వెంటపడుతున్నాయని కొన్నిచోట్ల గాయపరచిన సందర్భాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులతో చిన్న చిన్న వ్యాపారస్తులు కూడా నష్టపోతున్నారని పాలకవర్గం అధికారులు వెంటనే కోతులు, విధి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రేమ వివాదం రెండు కుటుంబాల్లో శోకం

**జీడిమెట్ల యువతి మృతి కేసులో నిందితుడు**

**భీమిలిలో అనుమానాస్పద మృతి**

**- రెండు రాష్ట్రాల్లో పోలీసుల సమన్వయ దర్యాప్తు**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): ప్రేమ పేరుతో మొదలైన పరిచయం, చివరకు రెండు కుటుంబాల్లో చెరగని విషాదాన్ని మిగిల్చిన ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వెలుగుచూసింది. జీడిమెట్లలో యువతి పావని (25) మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్. శ్యామ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమిలిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కేసుకు కొత్త మలుపు తిప్పింది.

ఆరు సంవత్సరాల సంబంధం -- పునరావృత విభేదాలు

పోలీసుల దర్యాప్తు ప్రకారం, పావని--శ్యామ్ మధ్య సుమారు ఆరు సంవత్సరాలుగా పరిచయం కొనసాగింది. 2019లోనే ఈ సంబంధంపై ఇరువురు కుటుంబాలు అభ్యంతరాలు వ్యక్తం చేసి పోలీసులను ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సమయంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారిని విడదీశారని అధికారులు తెలిపారు.

అయితే, అనంతరం మళ్లీ వారిద్దరి మధ్య సంప్రదింపులు కొనసాగినట్లు కాల్ రికార్డులు, డిజిటల్ ఆధారాలు సూచిస్తున్నాయి. ఇటీవల మహాశివరాత్రి సందర్భంగా పరస్పర సమ్మతితో కలుసుకున్నారని తెలిసింది. ఈ కలయిక తర్వాత సంబంధంలో విభేదాలు మళ్లీ తీవ్రరూపం దాల్చినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

జీడిమెట్లలో యువతి మృతి

ఫిబ్రవరి 17 తెల్లవారుజామున గాజులరామారం, వివేకానంద నగర్‌లోని అద్దె గృహంలో పావని మృతి చెందినట్లు సమాచారం అందింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు కాపాడలేకపోయారు.

ఈ ఘటనపై కుటుంబ సభ్యులు శ్యామ్ వేధింపుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 108 కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదు అనంతరం శ్యామ్ అదృశ్యమైనట్లు తెలిసింది.

భీమిలిలో నిందితుడి అనుమానాస్పద మృతి

కేసు నమోదు తర్వాత శ్యామ్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, అతను ఆంధ్రప్రదేశ్‌లోని భీమిలి ప్రాంతానికి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడ ఓ లాడ్జిలో అతను మృతిగా కనిపించినట్లు స్థానిక పోలీసుల సమాచారం. ఈ ఘటనపై భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రాథమికంగా అతను కూడా స్వయంగా ప్రాణాలు తీసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

రెండు రాష్ట్రాల్లో పోలీసుల సమన్వయ దర్యాప్తు

ఈ ఘటన తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచలనం రేపింది. సైబరాబాద్ , ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారులు పరస్పర సమన్వయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాల్ డేటా రికార్డులు, మొబైల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, సీసీటీవీ దృశ్యాలు, గత ఫిర్యాదుల వివరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఇరువురు కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, స్నేహితుల వివరాలు సేకరించబడుతున్నాయి. ప్రేమ సంబంధాల్లో తలెత్తే విభేదాలు, కుటుంబ ఒత్తిళ్లు, భావోద్వేగ పరిణామాలు ఎంతటి విషాదాలకు దారి తీస్తాయో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

దర్యాప్తు పూర్తి అయిన తర్వాతే ఘటనకు గల అసలు కారణాలు స్పష్టమవుతాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.

భావోద్వేగ ఒత్తిళ్లు లేదా మానసిక సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణుల సహాయం పొందడం అవసరం అని అధికారులు సూచిస్తున్నారు.

## అఖండ హరినామ సప్తకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారికి ఆహ్వానం

ఇచ్చోడ ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : ఇచ్చోడ మండలంలోని ధర్మపురి గ్రామంలో ఈనెల 25వ తేదీన జరిగే అఖండ హరినామ సప్త కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆహ్వాన పత్రికను గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, తానజీ, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి,దేవేందర్ రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సీఎం చిత్రపటం ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం



తెలకపల్లి, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ కార్యాలయాలలో నిబంధనల మేరకు గత కొన్ని సంవత్సరాలుగా ముఖ్యమంత్రి చిత్రపటం అందరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది ప్రస్తుతం కొందరు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ప్రజలు విమర్శలు చేస్తున్నారు శనివారం నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం అదేవిధంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆయా ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి చిత్రపటం తోపాటు మహనీయుల చిత్రపటాలను ఏర్పాటు చేయాలని ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి అభిమానులు డిమాండ్ చేస్తున్నారు

## ప్రింట్ మీడియా పాత్ర సమాజ నిర్మాణంలో ఎంతో కీలకం

### మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు

### మేడిపల్లి మండలం ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ డైరీ అవిష్కరణ...



బోడుప్పల్,ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర) ; మేడిపల్లి మండలం ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2026 డైరీని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆయన నివాసంలో ఘనంగా అవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ
ప్రింట్ మీడియా పాత్ర సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని, ఇలాంటి కార్యక్రమాలు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు జన్నె రాజు, క్లబ్ అధ్యక్షులు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, సీనియర్ సభ్యులు ననుబోతు రాము యాదవ్, సంయుక్త కార్యదర్శి చిన్నం మధు, బైరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌లో ఘనంగాసంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకలు

### -సేవాలాల్ జయంతి వేడుకలు పాల్గొన్న మంత్రి జూపల్లి, కలెక్టర్ సంతోష్



కొల్లాపూర్ ఫిబ్రవరి 21 :(విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను గిరిజన లంబాడి సోదరులు ఏర్పాటు చేశారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ లు సైకాలజిస్ట్ సోదరు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ముందుగా అందరికీ సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు ఆయన తెలిపారు. అలాగే అనవసరమైన ఖర్చులను తగ్గించుకొని మీ పిల్లల్ని మంచి చదువులని చదివించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మనం పుట్టినప్పుడు మనిషికి శ్వాస ఊపిరి మాత్రమే ఉంటుందని, చనిపోయినప్పుడు పేరు మాత్రమే వస్తుందని బతికిన కొన్ని రోజులైనా సమాజం మెప్పు పొందే విధంగా మనం జీవించాలని మంత్రి జూపల్లి అన్నారు. ఈరోజు చాలామంది గంజాయి మత్తు పదార్థాలకు బానిసలై వాళ్ల జీవితాలను నాశనం చేసుకుంటారు . కావున తల్లిదండ్రులు పిల్లల పై నిగా ఉంచి మంచి చదువులను చదివించాలని అనవసరమైన దుబారా ఖర్చులను ఖర్చుపెట్టకుండా కష్టపడిన డబ్బులను పోగు చేసుకోవాలని ఆయన అన్నారు. అలాగే ప్రతి ఇంట్లో పుస్తకాలు ఉండే విధంగా చూసుకోవాలని అలాగే ప్రతి ఇంటికి పత్రిక పేపర్లు వచ్చే విధంగా మీరు చూసుకోవాలని లంబాడీ గిరిజన కుటుంబాలకు మంత్రి తెలిపారు. స్టేజిపై గిరిజనా లంబాడి విద్యార్థులతో మంత్రి జూపల్లి కలెక్టర్ స్టేజిపై పాటలకు చేస్తున్న నృత్యం లో పాల్గొన్నారు. సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీ పిల్లల్ని కష్టపడి చదివించాలని నేను ఈరోజు ఈ కలెక్టర్ స్థానంలో ఉన్నానంటే నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను చదివించి కలెక్టర్ ను చేయగలిగారని మీరు కూడా అనవసరమైన ఖర్చులను చేయకుండా పిల్లల్ని చదివించండి అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్టీవో బన్సీలాల్ నాయక్ మండలాల తాసిల్దారులు మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ అధికారులు కౌన్సిలర్ లు లంబాడీ గిరిజన కుటుంబాలు ప్రజా ప్రతినిధులు పోలీసులు పాల్గొన్నారు.

## కప్పర హరిప్రసాద్ రావు కూతురు వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నేతల సందడి

### వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా ప్రముఖులు



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): గాంధీభవన్ సీ.పీ.ఆర్.ఓ కప్పర హరిప్రసాద్ రావు కూతురు తేజస్విని వివాహ వేడుక ఘనంగా జరిగింది. తేజస్విని--అఖిల్ మనోజ్‌ల వివాహ మహోత్సవానికి పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , దానం నాగేందర్ , ఎస్.ఏ. సంపత్ కుమార్ , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సారెడ్డి భూపతి రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వివాహ వేడుక సాంప్రదాయబద్ధంగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో హర్షోల్లాస వాతావరణంలో జరిగింది. కార్యక్రమం మొత్తం సాదర స్వాగతాలతో, ఆత్మీయ వాతావరణంలో సాగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కప్పర హరిప్రసాద్ రావు కుటుంబానికి అభినందనలు తెలిపారు. రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.

## కళ్యాణిలో అంగరంగ వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు



తానూర్,ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర): మండలంలోని కళ్యాణి గ్రామంలో ఆదివారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారి బోనాల పండుగను కన్నుల పండువగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు, సాయంత్రం శివశక్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు, భజంత్రీల నడుమ శోభాయాత్ర వైభవంగా సాగింది, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి, గ్రామాన్ని చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు,ఆడపడుచుల రాకతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# సోషలిజం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యం: సిపిఎం నేతలు

### "రెడ్ బుక్ డే" సందర్భంగా ప్రగతి నగర్‌లో 'బరితెగించిన అమెరికన్ సామ్రాజ్యవాదం' పుస్తకంపై చర్చ -- అమెరికా విధానాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు



బాచుపల్లి, ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర): సామాజిక న్యాయం సాధనకు సోషలిజమే ప్రత్యామ్నాయం అని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. "రెడ్ బుక్ డే" సందర్భంగా బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో 'బరితెగించిన అమెరికన్ సామ్రాజ్యవాదం' అనే పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత వికృత రూపమే సామ్రాజ్యవాదమని విమర్శించారు. అమెరికా నాయకత్వంలో జరుగుతున్న యుద్ధాలు, ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ వ్యవహారాల్లో జోక్యాలు ప్రపంచ దేశాలకు ముప్పుగా మారాయని వారు అభిప్రాయపడ్డారు.
ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చి పాలస్తీనా ప్రాంతాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు ప్రపంచ ప్రజలను కలవరపెడుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఇరాక్‌పై దాడులు చేసిన విధంగానే ప్రస్తుతం ఇరాన్‌పై ఒత్తిళ్లు తీసుకువస్తోందని విమర్శించారు. సుంకాల పేరుతో వివిధ దేశాలను బెదిరించడం, ఆర్థిక ఆంక్షలు విధించడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన ఆధీనంలో ఉంచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.
మన దేశంపైనా సుంకాల హెచ్చరికలు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించడంలో వెనుకంజ వేస్తోందని వారు విమర్శించారు. దేశ ప్రయోజనాలు, స్వాభిమానాన్ని కాపాడే విధంగా స్వతంత్ర విదేశాంగ విధానం అవలంబించాలని డిమాండ్ చేశారు. ప్రజలు సామ్రాజ్యవాద దురాగతాలను అర్థం చేసుకుని చైతన్యవంతులై ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి బాల, సిపిఎం నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో సామాజిక న్యాయం, స్వావలంబన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

# ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) లివైద్య శిబిరాన్ని సందర్శించి న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్హనుమకొండ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్క నూర్ లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సందర్శించారు.హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రజల కోసం స్థానిక మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. మెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, ,ప్రాథమిక పరీక్షల కౌంటర్లను ,కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను , ఈసీజీ మరియు ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే హాజరైన సర్పంచులను వారి వారి గ్రామాల నుండి ఎంతమంది ఏ సమస్యలతో రావడం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.

జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి జనగామకు చెందిన (8 )విభాగాల నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముల్కనూర్ ,వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు ఏఎన్ఎంలు, ఆశా లు , మహిళా సమాఖ్య సభ్యులు , గ్రామ కార్యదర్శులు సంబంధిత గ్రామ ప్రజలను గుర్తించి శిబిరానికి పంపించగా వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరంలో 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్లు సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు , రేడియోగ్రాఫర్లుపారామెడికల్ సిబ్బంది , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మొత్తం (75)మందిలపాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్రే మరియు ఈసీజి ఏర్పాటు చేయడం జరిగింది

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని , స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతున్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో (310)మందికి ఒక్కరికి దాదాపుగా 1800 రూపాయల విలువైన ల్యాబ్ పరీక్షలు చేయడం జరిగింది.5 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ గారి విజ్ఞప్తి మేరకుజిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మృత్యుంజయ రెడ్డి దాదాపుగా ఒక లక్షరూపాయల విలువైన మందులు అందించడం జరిగింది.

మొత్తం వైద్య శిబిరంలో ( 863)వైద్య సేవలు అందుకోగా అందులో జనరల్ మెడిసిన్ 284)ఎముకలవైద్యానికి సంబంధించి ( 143)పిల్లలకు సంబంధించిన సమస్యలు ( 93)చర్మవ్యాధి సమస్యలు ( 44)చెవి ముక్కు గొంతు సంబంధిత సమస్యలు ( 49)జనరల్ సర్జరీ ( 26)స్త్రీలకు సంబంధించిన సమస్యలు(.34)కంటి సమస్యలకు (190)చికిత్స అందించడం జరిగింది. అలాగే మరింత మెరుగైన పరీక్షలు చికిత్స నిమిత్తం (12 ) మందిని ఎంజీఎం ఆసుపత్రి, జిఎంహెచ్ లకు (18) క్యాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తంలరిఫర్ చేయడం జరిగింది. 89 ) ఎక్స్ రే మరియు (40) ఈసీజీ పరీక్షలు. లాబ్ పరీక్షలు (310)నిర్వహించడం జరిగిందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య తెలియజేశారు. దృష్టిలోపాలున్న (54) మంది కి పెద్ది వసంత ఫౌండేషన్ ద్వారా అద్దాలు అందజేయడం. జరుగుతుందని శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య, స్థానిక సర్పంచ్ శ్రీ. ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీ. కే.మమత, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్, వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రవణ్ విశ్వనాథ కాలనీ సర్పంచ్ కస్తూరి సుధాకర్, ధర్మారం సర్పంచి గోపగోని తిరుపతి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, స్థానిక తహసిల్దార్ రాజేష్ ఎంపీడీవో వీరేశం ,జనగామ నుండి డాక్టర్ డాక్టర్ సంజీవయ్య,. డాక్టర్ హైమావతి డాక్టర్ సుప్రియ ,డాక్టర్ శ్వేత డాక్టర్ మానస్ , డాక్టర్ ఉదయ్. డాక్టర్ సుష్మ డాక్టర్ ప్రశాంత్ ,, డాక్టర్ వర్షిణి, ముల్కనూరు, వంగర ఎల్కతుర్తివైద్యాధికారులు డాక్టర్ స్వప్న ,డాక్టర్ రెహమాన్ ,డాక్టర్ రాజశేఖర్ , డాక్టర్ భార్గవ్ డాక్టర్ సురేష్,, పల్లెదవ ఖానా వైద్యాధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ రెహమాన్ ,డెమో వి అశోక్ రెడ్డి , ఎజుూ లువరాజేశ్వర్ రెడ్డి మోహన్,అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ విద్యాలయాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన యుపిఎస్ ఎల్కలపల్లి

**=పరిశుభ్రత, పచ్చదనంలో రాష్ట్ర టాప్--20లో స్థానం**

**=రెండు వేలకుపైగా పాఠశాలల మధ్య విశిష్ట గుర్తింపు**

గోదావరిఖని ఫిబ్రవరి 21 విజన్ ఆంధ్ర : స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ ( ఎస్ హెచ్ వి ఆర్) కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల పరిశుభ్రత, పచ్చదనం, తాగునీటి సదుపాయం, శౌచాలయాల నిర్వహణ వంటి ఆరు ప్రధాన అంశాలపై 60 ప్రశ్నల సూచిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం మూల్యాంకనం నిర్వహించింది. ఈ సమగ్ర పరిశీలనలో యుపిఎస్ ఎల్కలపల్లి పాఠశాల విశిష్ట ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది.

పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలంలోని యుపిఎస్ ఎల్కలపల్లి పాఠశాల తెలంగాణ రాష్ట్రంలోని రెండు వేలకుపైగా పాఠశాలలతో పోటీ పడి రాష్ట్ర టాప్--20 ఉత్తమ ఎస్ హెచ్ వి ఆర్ పాఠశాలల్లో ఒకటిగా నిలిచి జాతీయ స్థాయికి నామినేట్ కావడం విశేషం. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన శౌచాలయాలు, పచ్చని వాతావరణం, విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం వంటి అంశాలు ఈ విజయానికి దోహదపడ్డాయి.

ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , జిల్లా విద్యాధికారి శారద, జిల్లా ఏఎమ్ఓ శ్రీ షేక్ , పాలకుర్తి మండల విద్యాధికారి విమల , కన్నాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కమలాకర్ రావు యుపిఎస్ ఎల్కలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ గారిని, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

జాతీయ స్థాయిలో కూడా యుపిఎస్ ఎల్కలపల్లి పాఠశాల ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపిక కావాలని అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆకాంక్షించారు. ఈ విజయం పాలకుర్తి మండలానికి, పెద్దపల్లి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

## దుండిగల్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌కు జోనల్ కమిషనర్ పర్యవేక్షణ

**మెయిన్ రోడ్ల నుంచి జంక్షన్‌ల వరకు పరిశీలన -**

**- చెత్త వేరు చేసి స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలని ఆదేశాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన హెచ్చరిక**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): దుండిగల్ సర్కిల్–59 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీ సందీప్ కుమార్ జా (ఐఏఎస్) శనివారం ఉదయం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఉదయం వేళల్లోనే మెయిన్ రోడ్లు, చౌరస్తాలు, జంక్షన్ పాయింట్లు పూర్తిగా శుభ్రపరచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి దూలపల్లి ఎండింగ్ పాయింట్ వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన కమిషనర్, రోడ్డు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి చెత్తను బయట వేయకుండా, తడి చెత్త--పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి చెత్తను



ఎక్కడ పడితే అక్కడ వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీలు) గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున వ్యాపార సంస్థలు, హోటళ్లు, దుకాణాలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈఈ అన్వేష్ రెడ్డి, ఏఈఈ అశోక్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్, పర్యావరణ ఇంజనీర్ సాత్విక్, ఎస్ఎఫ్ఏలు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ల ద్వారా దుండిగల్ సర్కిల్‌ను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా మార్చడం లక్ష్యమని అధికారులు తెలిపారు.



## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్...

బోధన్, ఫిబ్రవరి21 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని చెక్కి క్యాంపులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సబ్ కలెక్టర్ వికాస్ మహాతో శనివారం సందర్శించారు. ఎఫ్.ఎల్.ఎన్. బేస్ లైన్, మిడ్ లైన్ అస్సెస్మెంట్ పరీక్ష పేపర్ లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. విద్యార్థులకు తేలికగా చదివేందుకు తగు సూచనలు సలహాలు చేశారు.

## మంచిర్యాల కార్పొరేషన్ మేయర్‌ని సన్మానించిన ఆర్ఎంపీలు

నస్పూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ ని మర్యాదపూర్వకంగా శనివారం నస్పూర్ లోని తన నివాసంలో నస్పూర్ టౌన్ ఆర్ఎంపి, పిఎంపి హెల్పర్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పరుష సతీష్, ప్రధాన కార్యదర్శి బియ్యాల లక్ష్మణ్, కోశాధికారి బిట్ల వెంకటస్వామి, గౌరవ అధ్యక్షులు అటికం శ్రీనివాస్, కొయ్యల రాజు, ఉపాధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శ్రీధర్, సత్యనారాయణ, అశోకు, సదన్, సత్యం, రవీందర్, నాగరాజు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొనడం జరిగినది.





## మున్సిపల్ చైర్ పర్సన్ కు శుభాకాంక్షలు తెలిపిన ఏసీపీ...

బోధన్, ఫిబ్రవరి21 (విజన్ ఆంధ్ర) : బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి కి ఏసీపీ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పట్టణంలోని చైర్ పర్సన్ నివాసంలో చైర్ పర్సన్ దంపతులు తూము పద్మ శరత్ రెడ్డి లను ఏసీపీ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండవ సారి బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## చేవెళ్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం..

### - మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

### : డా. పట్నం మహేందర్ రెడ్డి



చేవెళ్ల,ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్పర్సన్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి శనివారం మహేందర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన శాలువాతో సన్మానించారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, తాళ్లపల్లి నర్సింలు, మాజీ సహకార సంఘం చైర్మన్ దేవర వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ భీమయ్యతో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

## గురుకులంలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు సిద్ధం

నడిగూడెం,ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర ): ఉమ్మడి గురుకులాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 22న నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి తెలిపారు.నడిగూడెం గురుకుల పాఠశాల కేంద్రంలో మొత్తం 600 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఐదవ తరగతి ప్రవేశంతో పాటు 6,7,8,9తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఇదే రోజు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఉదయం11గంటల నుంచి మధ్యాహ్నం1గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను పరీక్ష ప్రారంభానికి గంట ముందు కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు.పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి హాల్ టికెట్,పరీక్షా ప్యాడు,బ్లూలేదాబ్లాక్ పెన్నులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.



# గ్రామీణ వాస్తవాలపై విద్యార్థుల అధ్యయనం

చేవెళ్ల,ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): గ్రామాలతో ప్రత్యక్ష అనుసంధానం విద్యార్థుల అకడమిక్ పరిజ్ఞానాన్ని విస్తరించడంతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుంది అని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి. కాంచనలత తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం దేవుని ఎరవల్లి వార్డులో గ్రామీణ పరిశీలన నిర్వహించారు. ప్రాయోగిక అవగాహన కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామ ప్రజల జీవన పరిస్థితులు, వ్యవసాయ ఆధారిత ఉపాధి, మార్కెటింగ్ విధానాలపై సమాచారాన్ని సేకరించారు.

అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం.ఏ. మాలిక్ పర్యవేక్షణలో రైతులు, కూలీలు, మహిళా సంఘాలు, వృద్ధులతో మాట్లాడిన విద్యార్థులు పంటల నమూనాలు, సాగు వ్యయం, ఇన్పుట్ల లభ్యత, రుణ సదుపాయాలు, కనిష్ఠ మద్దతు ధరపై అవగాహన, కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై వివరాలు నమోదు చేశారు. నీటి కొరత, పెరుగుతున్న ఖర్చులు, తెగుళ్లు, వాతావరణ ప్రభావాలు, మార్కెట్ మార్పులు వంటి సమస్యలను రైతులు వెల్లడించగా, కోత అనంతర పనుల్లో మహిళల పాత్రను



విద్యార్థులు గమనించారు. ఇలాంటి పరిశీలనలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందిస్తాయని డా. మాలిక్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని అభినందించిన ప్రిన్సిపాల్ సి. కాంచనలత, సమాజ అనుభవంతో అనుసంధానమైన విద్యాభ్యాసం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు.

# ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు నిలిపివేస్తే చర్యలు తప్పవు

### - విద్యార్థులను వేధించే ప్రైవేట్ కళాశాలలపై వెంటనే స్పందిస్తాం

### - ఎస్ఎఫ్ఐ నాయకులు బేగరి అరుణ్ కుమార్

చేవెళ్ల ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): ఫీజులు చెల్లించలేదనే కారణంతో హాల్‌టికెట్లు ఆపడం అన్యాయమని, అలాంటి ఘటనలు జరిగితే విద్యార్థులు వెంటనే ఎస్ఎఫ్ఐ నాయకులను సంప్రదించాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ లో శనివారం నిర్వహించిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఫీజులు లేదా స్కాలర్షిప్ పేర్లతో విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం సహించబోదన్నారు. సమాచారం అందిన వెంటనే స్పందించి యాజమాన్యాలతో చర్చించి హాల్‌టికెట్లు





అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. సమావేశంలో చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి మణికంఠ, సోషల్ మీడియా ఇంచార్జి వినోద్‌తో పాటు తరుణ్, సంతోష్, వేణు, రిషికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కబడ్డీ జట్టులో నడిగూడెం యువకుడు కాసాని సాయి ఎంపిక

నడిగూడెం,ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర ): 74వ జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలకు నడిగూడెం మండలం బృందావనపురం గ్రామానికి చెందిన కాసాని సాయి ఎంపిక కావడం పట్ల మండలంలో ఆనంద వాతావరణం నెలకొంది. నిరుపేద కుటుంబంలో జన్మించిన సాయి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో ఆడే అవకాశాన్ని సాధించడం గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు.

సాయికి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వీరేందర్ కి,జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డికి, జిల్లా ప్రధాన కార్యదర్శి నామా నరసింహారావుకు నడిగూడెం మండల కబడ్డీ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పేరెల్లి కోటి, కార్యదర్శి కరుణాకర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు నడిగూడెం మండలం నుంచి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం సాయికే రావడంసంతోషకరమన్నారు.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ మండలానికి, తన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈనెల 24 నుండి 27 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో సాయి పాల్గొననున్నాడు. మండల ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్లే స్కూల్స్ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెంపొందాలి:

### బచ్పన్ రైమ్స్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద -- విద్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సూచన

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): చిన్నారులకు వినోదాత్మక విద్య అందించడం ద్వారా వారి సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పేర్కొన్నారు. శనివారం జీహెచ్ఎంసీ పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ, నార్త్ ఎన్సీఎల్ కాలనీలో ఉన్న బచ్పన్ రైమ్స్ స్కూల్లో నిర్వహించిన "స్కూల్ అన్యువల్ డే" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, ప్రాథమిక దశలోనే పిల్లలకు సరైన మార్గనిర్దేశం అవసరమని పేర్కొన్నారు. ప్లే స్కూల్స్ పిల్లలలో నేర్చుకునే ఆసక్తిని పెంచడమే కాకుండా, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిన్నారులు ఆలపించిన వందేమాతరం గేయం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ ప్రవీణ్ రావు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వృథా అనేది వద్దు సద్వినియోగమే ముద్దు

### డా. కె.వెంకటసుబ్బారెడ్డి.

బద్వేలు, ఫిబ్రవరి 21( విజన్ ఆంధ్ర) స్థానిక పట్టణంలోని శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలోని రాాలూా నోడల్ ఆఫీసర్ సి.హెచ్. ఈశ్వరయ్య ఏర్పాటు చేసిన స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్ర ప్రోగ్రామ్ చెత్త రహిత పరిపాలన కళాశాలలో విద్యార్థులతో కలిసి కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకటసుబ్బారెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ మన దేశంలో ప్రకృతి నుండి మన జీవన మనుగడకు కావలసిన వివిధ రకాల వనరులను సంవృద్ధిగా పొందగలుగుతున్నామని కావున వాటిని ఒకసారి వినియోగించుకున్నాక వ్యర్థాలను వృథా చేయకుండా తిరిగి మరొక రకంగా వినియోగించుకొనే విధంగా ప్రజలు ఆలోచించి, ప్రకృతి వనరులను సద్వి నియోగిపరుచుకొని భావి తరాలకు ప్రకృతి వనరుల కొరత లేకుండా చేయాలని ఆయన తెలిపారు అనంతరం.నోడల్ ఆఫీసర్ సి.హెచ్. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాలను పూర్తిగా ఆపివేయాలని, రాష్ట్రాన్ని ప్రమాధకరమైన ప్లాస్టిక్ నుంచి కాపాడుకోవలసిన భాద్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యారని,విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

## టిడిపి మాజీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

### డిసిసి బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



బద్వేలు, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) బద్వేల్ మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గాజుల పల్లె చంద్రశేఖర్ రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం జరిగింది ఈ మరణ వార్త విషయం తెలుసుకున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కడప డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి, బొజ్జ రోశన్న లు చింతలచెరువులోని వారి స్వగ్రాహానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా విజయమ్మ, సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ చంద్రన్న టిడిపి పార్టీ కోసం ఎన్నో సంవత్సరాల నుండి పార్టీకి సేవలు అందిస్తూ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేశారని వారు అన్నారు వీరి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ సాధనకారి రంతు, బద్వేలు మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవి కుమార్ రెడ్డి, కడప పార్లమెంటు ఆర్గనైజింగ్ అధ్యక్షులు బైసాని ప్రతాపరెడ్డి, మున్నల్లి గ్రామ నాయకుడు రమణారెడ్డి, రైల్వే కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులు రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు పిలుపు

### మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



మెట్ పల్లి డివిజన్ రిపోర్టర్, ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర ) : ఓపెన్ ఇంటర్ లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మెట్ పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే . వేంకయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ ఏ; బీ. కాం. కోర్సులు ఉన్నాయని, డిగ్రీలో చేరటానికి "ఓపెన్ ఇంటర్" ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని అన్నారు. డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు గ్రూపు - 1,2,3,4 వంటి పోటీ పరీక్షలతో పాటు సివిల్ సర్వీసులు, బ్యాంకింగ్, రైల్వే వంటి శాఖలలో నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరు కావచ్చని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెంటనే చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య ఓపెన్ ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఓపెన్ ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని రకాల పోటీ పరీక్షలు రాయటానికి అర్హులేనని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఎంఈఓ చంద్రశేఖర్, ఓపెన్ ఇంటర్ నిర్వాహకులు, బండలింగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పెరంబుదూరు లింబగిరి స్వామి, శ్రీనివాస్, సంధ్య, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## లంక మల్ల దేవస్థానం వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో



బద్వేలు, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) బద్వేలు పట్టణానికి సమీపంలో గల లంకమల్లేశ్వర కోనలో ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బద్వేలు రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్, బద్వేలు మండల అభివృద్ధి అధికారి డి మల్లేశ్వరి, తహసిల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు బద్వేలు అటవీ రేంజ్ అధికారి నయీమ్,ల ఆధ్వర్యంలో శివరాత్రి పండుగ సందర్భంగా లంక మల్ల కోనలో ఉన్నటువంటి చెత్త,చదారాన్ని లంక మల్ల లోని రామలింగేశ్వర స్వామి దేవాలయం సముదాయ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయ రెవెన్యూ పురపాలక సంస్థ అటవీ శాఖ సిబ్బంది వెటర్నరీ డాక్టర్స్ మరియు వారి సిబ్బంది మిగతా ప్రభుత్వ శాఖల సిబ్బంది సుమారు వందమందికి పైగా కలిసి మూడు ట్రాక్టర్లు తో ఉన్న తడి మరియు పొడి చెత్తను పోగుసేసి వీరబల్లి గ్రామ సచివాలయం పిసి షెడ్డు కు తరలించారు

## వైసిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్ యాదవ్

తిరుపతి, ఫిబ్రవరి 21: వైయస్సార్సీపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీ కి చెందిన చెరకుల జనార్దన్ యాదవ్ ను వైయస్సార్సీపి రాష్ట్ర పార్టీ నియమించారు. జనార్దన్ యాదవ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బీసీలలో మంచి పట్టున్న నాయకుడు. గత మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం జనార్ధన్ యాదవ్ ది. వైయస్సార్సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. తిరుపతి రూరల్ మండలం తో పాటు నియోజకవర్గంలోని మిగిలిన మండలాలలో పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారు. జనార్దన్ యాదవ్ కు బీసీలలో మంచి పట్టు ఉండడంతో పార్టీ అధిష్టానం గుర్తించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు యాదవ్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా బీసీలను పార్టీ పట్ల ఆకర్షితులను చేసేందుకు ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్ర బీసీ సెల్ విభాగంలో కీలక పదవిని కట్టబెట్టారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తో పాటు చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లతో పాటు రాష్ట్ర ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా జనార్దన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పర్యటించి బీసీలను వైసీపీ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చేయడంతో పాటు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో పర్యటించి బిసి కమిటీలను వెయ్యనున్నట్లు తెలిపారు.

## కోళ్ల ఫార్మ్ వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

### -పట్టించుకోని సంబంధిత అధికారులు

### -నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్న యాజమాన్యం.

అందోల్ /మెదక్ ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర ) రేగోడు మండల పరిధిలోని టి.లింగంపల్లి దోసపల్లి గ్రామ శివారులో గల కోళ్ల ఫార్మ్ అక్కడ ఏర్పాటు చేయడంతో లక్షలకొద్దీ కోళ్లను పెంచడంతో వాటికి అధిక లాభాలు పొందేందుకు కోళ్లి ఫామ్ యాజమాన్యం మందులు వేయడంతో రోడ్డుపై వెళ్లే దోసపల్లి - టి.లింగంపల్లి,తాటిపల్లి గ్రామస్తులకు దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.ఉదయం సాయంత్రం వేళల్లో గాలితో దుర్వాసన రావడంతో దోసపల్లి గ్రామస్తులు ఇబ్బందులు తప్పడం లేదు, సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కోళ్లీ ఫామ్ యాజమానిపై చర్యలు తీసుకొని దుర్వాసన రాకుండా చూడాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పోలీస్ స్టేషన్ స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు



నడిగూడెం, ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర ): ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించిన 'సెట్--ఏ' ప్రశ్నాపత్రాలు శనివారం నడిగూడెం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి.పరీక్షల నిర్వాహకులు ప్రశ్నాపత్రాలను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.నడిగూడెంలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులు డి. విజయ్ నాయక్,సిహెచ్. వాణి,విభాగాధికారులు రాజు,రవికుమార్,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

నడిగూడెం, ఫిబ్రవరి 21 ( విజన్ ఆంధ్ర): మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు,దేవాలయాలు, జనావాసాల సమీపంలోనే బెల్ట్ షాపులు నడుస్తుండటంతో మహిళలు,పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం అధికారికంగా మద్యం విక్రయాల కోసం లైసెన్స్ పొందిన దుకాణాలను మాత్రమే అనుమతించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ బెల్ట్ షాపుల వద్ద యువకుల గుంపులు గుమికూడడంతో స్థానికంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. బెల్ట్ షాపుల కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.రోజువారీ కూలీ పనులు చేసే వ్యక్తులు తమ సంపాదనలో ఎక్కువ భాగాన్ని మద్యం కోసం ఖర్చు చేయడం వల్ల కుటుంబాల ఆర్థిక స్థితి దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు.గ్రామాల్లో ఇప్పటికే ఉన్న అధికారిక మద్యం దుకాణాలకు అదనంగా బెల్ట్ షాపులు నిర్వహించడం చట్ట విరుద్ధమని తెలిసినా, సంబంధిత శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొన్ని చోట్ల రాజకీయ ఆశ్రయం కూడా ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితిపై తక్షణ చర్యలు తీసుకుని అక్రమ బెల్ట్ షాపులను మూసివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్.!

## - దొంగ వస్తువులు కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణ యజమాని అరెస్ట్ -- రిమాండ్

## - దొంగతనం చేసిన వ్యక్తి, దొంగ వస్తువులు కొనుగోలు చేసిన వ్యక్తి ఇద్దరూ అరెస్ట్ - రిమాండ్

ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 21:- బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 20వ తేదీన దిగ్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అంబే స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బజారహత్నూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు బోథ్ సీఐ డి. గురుస్వామి తెలిపారు. గత నెలలో దిగ్నూర్ గ్రామానికి చెందిన ఒక బోర్వెల్ పాడవడంతో, అందులోని పది పైపులను బయటకు తీసి అదే గ్రామానికి చెందిన కొర్వెల్లి రామకృష్ణ ఇంటి స్థలంలో ఉంచారు. ఈ నెల 16వ తేదీన యజమాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో, కొర్వెల్లి రామకృష్ణ ఆ పైపులలో ఆరు పైపులను దొంగిలించినట్లు తెలిపారు. అందులో నాలుగు పైపులను ఇచ్చోడాలోని షేక్ ముజాహిద్ అనే స్క్రాప్ దుకాణ యజమానికి విక్రయించినట్లు విచారణలో తేలింది. దొంగతనం చేసిన వస్తువులు అని తెలిసినా కొనుగోలు చేసినందుకు షేక్ ముజాహిద్ను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. అలాగే దొంగతనం చేసిన రామకృష్ణను కూడా అరెస్ట్ చేసి రిమాండ్కు పంపినట్లు పేర్కొన్నారు. దొంగిలించిన వస్తువుల విలువ సుమారు రూ. 3,000 వరకు ఉంటుందని తెలిపారు. దొంగతనం చేసిన వస్తువులను కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజారహత్నూర్ ఎస్సై జి సంజయ్ పాల్గొన్నారు.

# మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి




## పట్నం నియోజకవర్గ బీఆర్ఎస్వి విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర ) : బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని నియోజకవర్గ బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీల పక్షపాతి అని అన్నారు. పూటకు ఒకసారి ఇష్టానుసారంగా పదవి ఆశతో మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై కౌన్సిలర్ ఆకుల యాదగిరి తప్పుడు మాట్లాడితే మున్సిపల్ ప్రజలు క్షమించరన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత మంచిరెడ్డి కిషన్ రెడ్డిదేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీట్లు 13 స్థానాలు గెలిపించుకున్న ఘనత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డికి దక్కిందన్నారు. మరోసారి మా నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు మడుపు శివసాయి, బీసీ సెల్ నాయకులు కాకి రవీందర్, కొండ్రు మహేష్, యాచారం సురేష్, సంతోష్, బన్నీ, యాదగిరి గౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేత

బోధన్, ఫిబ్రవరి21 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని సర్పాపూర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేశారు. సర్పాపూర్ వాసి, వార్డ్ కౌన్సిలర్ సమీనా మన్నన్ 20వేల రూపాయలను విరాళంగా ఇచ్చి విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ లను కొనుగోలు చేసి శనివారం పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగయ్య, గ్రామ పెద్దలు పత్తి అశోక్, రమావత్ మధు, ఉస్మాన్, జాదవ్ ప్రవీణ్ నాయక్, షేక్ మహబూబ్ బండి సలీం, గంగాధర్, అంగన్వాడీ టీచర్ విజయ, స్కూల్ చైర్మన్ ఎడ్ల విజయ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి మండలం ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ డైరీ



బోడుప్పల్,ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర); మేడిపల్లి మండలం ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2026 డైరీని మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కారదర్శి కొత్త కిషోర్ గౌడ్ ఆయన కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని,నేడు సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు.ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంకా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు అఫ్జల్, క్లబ్ అధ్యక్షులు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డేమాన్ సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, సీనియర్ సభ్యులు ననుబోతు రాము యాదవ్, సంయుక్త కార్యదర్శి చిన్నం మధు, బైరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, ధర్మ పరిరక్షణకు నిలయాలు దేవాలయాలు



## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

కొంపల్లి, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో, సమాజంలో శాంతి స్థాపనలో, ధర్మ పరిరక్షణలో దేవాలయాల పాత్ర అపారమని కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసి పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ ప్రాంతం, కొంపల్లి చౌరస్తాలో భైరవ వీరాంజనేయ స్వామి దేవాలయ పునఃనిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా, సమాజానికి నైతిక విలువలు, సద్గుణాలు బోధించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల సహకారంతో ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, సీనియర్ నాయకులు శిరీష ప్రవీణ్ రావు, చింతల దేవేందర్ యాదవ్, లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి భావంతో, వేడుకల మధ్య ఘనంగా కొనసాగింది.

# ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఆరోగ్య భరోసా



**- జగద్గిరిగుట్టలో మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే**

**- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగద్గిరిగుట్ట డివిజన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజల నుంచి మంచి స్పందన పొందింది. 126వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీపంలోని సంస్కృతి హై స్కూల్‌లో శిబిరాన్ని ప్రారంభించారు. మల్లారెడ్డి హాస్పిటల్, సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగద్గిరిగుట్ట ప్రాంతంలో అధిక సంఖ్యలో నిరుపేదలు నివసిస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్కృతి హై స్కూల్ యాజమాన్యం, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య బృందం, లయన్స్ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి. ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్. నరసింహులు, ఎస్.ఆర్. భాషా తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవడం విశేషం. ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని స్థానికులు కోరారు.

# వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన సర్పంచ్



కారేపల్లి,ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): కారేపల్లి గ్రామానికి చెందిన ఉడతల సంపత్ – సరితల నూతన వాటర్ ప్లాంట్ ను ( స్టార్ ఎస్ ఎస్ వాటర్ ప్లాంట్) శనివారం స్థానిక సర్పంచ్ మేదరి టోనీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ..గ్రామ ప్రజలకు నాణ్యమైన నీటిని సరఫరా చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,మాజీ వార్డు మెంబర్ గంగరబోయిన సత్యం,పాలిక వీరస్వామి,పేర్ని వెంకటేశ్వర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23న వలిగొండలో జరిగే క్షీరాభిషేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



యాదాద్రి(ఫిబ్రవరి 21)వలిగొండ (విజన్ ఆంధ్ర): ఈనెల 23న వలిగొండ పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశం మేరకు జరిగే క్షీరాభిషేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి లు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాత్రికేయుల సమావేశంలో ప్రకటించడం పట్ల వారికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేసేందుకు మండల నలుమూలల నుండి ఉద్యమకారులంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు చిలుగూరి సత్తిరెడ్డి,జిల్లా కార్యదర్శి కదిరేని స్వామి,బొడిగే సుదర్శన్,కళాకారుల విభాగం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎదురుగట్ల యాదగిరి,కొండూరు సత్తయ్య,కన్నెకంటి శ్రీనివాసచారి,ఎదురుగట్ల లక్ష్మయ్య,ఎదురుగట్ల సందయ్య,ఎడవల్లి కిరణ్,దండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

# విద్యావ్యవస్థలో సమూల మార్పులకు సర్కార్ శ్రీకారం

మానకొండూర్ విజన్ ఆంధ్ర ఫిబ్రవరి 21 : మారుతున్న కాలమాన పరిస్థితులు, పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో 13.39 కోట్ల రూపాయలతో చేపట్టే ఆధునీకీరణ పనులకు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఆ క్రమంలోనే ఇక్కడి డైట్ కు మహర్దశ పట్టనున్నదన్నారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నదే సర్కార్ ముఖ్యోద్దేశమని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన విద్య లేకపోతే సమాజం నష్టపోతుందన్నారు. అన్నివృత్తుల్లో గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తనివిద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే అవకాశం గురువులకేదక్కుతుందని ఆయన గుర్తు చేశారు. పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఒక విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చే సామర్థ్యం ఒక్క ఉపాధ్యాయునికి మాత్రమే ఉంటుందన్నారు. ప్రావీణ్యం గల ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటుందని, అందుకే ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాల్సినఅవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ శ్రీరాంమొండయ్య, తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్ర, మహాత్మా నగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కృష్ణకుమార్, ఏఈ సయ్యద్ మక్దుమ్, కాంట్రాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విద్యపై అవగాహన



ప్రభుత్వ డీగ్రీ కళాశాల కోడంగల్ లో కళాశాల ఎన్. ఎస్. ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, మండల న్యాయ సేవాధికార సంస్థ, కొడంగల్ సౌజన్యం తో విద్యార్థులకు న్యాయ విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు చెందిన సి. సునీత మరియు అడ్వకేట్ జెస్సికా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనల నుండి అప్రమత్తంగా ఉండాలని, ర్యాగింగ్, గృహహింస, వరకట్న దురాచారం, కుల వైషమ్యాలు, కిడ్నాప్, మానవ అక్రమ రవాణా, వంటి సందర్భాల్లో అనుసరించాల్సిన విధానాలపై, ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్. ఐ. ఆర్) నమోదు చేయడం, ఇతర సందర్భాల్లో ప్రభత్వం అందించే ఉచిత న్యాయ సేవల్ని, లోక్ అదాలత్ సేవల్ని పొందే విధానాన్ని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, టి. రాంబాబు, డా. ఆర్. శ్రీనివాస్, డా. ఇ. సోమ్లా, డా కె. రమేశ్ బాబు, కె. అన్నపూర్ణ, ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# కొడంగల్‌లో పద్య పఠన పోటీ నిర్వహణ



కొడంగల్, ఫిబ్రవరి 21: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్‌లో తెలుగు భాషా సాహిత్యాభివృద్ధి మరియు విద్యార్థుల్లో పద్యాల పట్ల ఆసక్తిని పెంపొందించుటకు కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో పద్య పఠన పోటీని ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో కళాశాలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రముఖ తెలుగు కవుల పద్యాలను సరైన ఉచ్చారణ, రాగం, భావ వ్యక్తీకరణతో పఠించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా. బి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు భాష అతి పురాతన మైనదే గాక అందమైన లిపిని కలిగిన భాష అన్నారు. మాతృ భాషలో భోధన వల్ల విషయ అవగాహన సులభతరమవుతుందని, మాతృ భాషను మరిస్తే అమ్మను మరిచినట్లే నన్నారు.పద్య పఠనం ద్వారా విద్యార్థుల్లో భాషపై పట్టు మరియు, గౌరవం, వేదికలపై మాట్లాడే ధైర్యం, సాహిత్యాభిరుచి పెరుగుతాయని పేర్కొన్నారు. మాతృభాష పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అత్యంత ముఖ్యమని, ఇలాంటి కార్యక్రమాలు వారి ప్రతిభను వెలికితీస్తాయని తెలిపారు. పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, బహుమతులను అందజేయగా ఈ కార్యక్రమాన్ని తెలుగు విభాగ అధ్యాపకులు బంటు నర్సిములు సమన్వయం చేయగా, అధ్యాపకులు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యూరియా వాడకంపై రైతులు అపోహలు వీడాలి.!

మానకొండూర్, విజన్ ఆంధ్ర ఫిబ్రవరి 21: యూరియా వాడకంపై రైతులు అపోహలు వీడి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ యూరియాను అధికంగా వాడితే అధిక దిగుబడి వస్తుందనే అపోహ చాలా మంది రైతుల్లో ఉందన్నారు. వాస్తవానికి ఇది నిజం కాదని, అపోహ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. మోతాదుకు మించి యూరియాను మోతాదుకు మించి వాడటం వల్ల మొక్కలు బలహీనంగా మారడమే కాకుండా నాణ్యత కూడా తగ్గుతుందన్నారు. అధిక యూరియా వాడటం వల్ల పంటపైననే కాకుండా ప్రజారోగ్యంపైన కూడా తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. యూరియా వాడకంపై రైతులను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయ సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ సన్నద్ధం కావాలన్నారు. యూరియా సమస్య జిల్లాకో, నియోజకవర్గానికో పరిమితం కాదని, ఇది దేశవ్యాప్త



సమస్యగా మారిందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు యూరియాకు కృత్రిక కొరత సృష్టిస్తున్నారని, అలాంటి వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్లయ్ చేసుకోవడమే తప్ప రిప్లయ్ వచ్చేది కాదని కవ్వంపల్లి ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇంటికి నోచుకోలేని నిరుపేదలు కాంగ్రెస్ పాలనలో సొంతింట కలను సాకారం చేసుకుంటున్నారన్నారు. మానకొండూర్ మండలం తొలి విడతగా ఇందిరమ్మ ఇంటి పథకం కింద 850 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 90 శాతం మేరకు నిర్మాణాలు జరిగాయని, రానున్న కొద్ది రోజుల్లో వాటిని పూర్తి చేసి గృహ ప్రవేశాలకు ఇందిరమ్మ ఇళ్లు సిద్ధం కానున్నాయన్నారు. మానకొండూర్ మండలానికి 23వ విడత కింద 90 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 23,95,500 లక్షల రూపాయలు మంజూరు కాగా, వాటిని ఇప్పుడు చెక్కుల రూపేణా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, ఇంచార్జీ తహసీల్దార్ నరేందర్, ఎంపీవో సతీష్ రావు, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, లక్ష్మీపూర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్, మద్దికుంట సర్పంచులు ఎడ్ల సత్యనారాయణ, బుర్ర శ్రీధర్ గౌడ్, పార్టీ నాయకులు మడుపు ప్రేమ్ కుమార్, తాళ్ల నరేష్, కోండ్ర సురేష్, కొత్తకొండ శంకర్, రామిడి తిరుపతి, సాయిరి దేవయ్య, గోపు శ్రీనివాస్ రెడ్డి, తోట శ్రీనివాస్, గొల్లెన కొమురయ్య, కనకం సంపత్, కనకం కుమార్,నాగిశెట్టి రాజయ్య, గుజ్జ ప్రభాకర్, ఎన్.బాబురావు, కె.చిరంజీవి, దూలం దేవేంద్ర, మంద రమాదేవి, ముక్కిస సతీష్ కుమార్, రామకృష్ణ, మహేందర్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

### తానూర్‌లో గ్రామ సభ:

## భూముల రీ-సర్వేపై అవగాహన



తానూర్, ఫిబ్రవరి 21: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రమైన తానూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూముల రీ-సర్వే మరియు తాజా పహాణీల తయారీపై గ్రామ సభను నిర్వహించారు, తహసిల్దార్ మహేందర్ నాథ్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ సరిహద్దుల గుర్తింపు, ప్రభుత్వ భూముల రక్షణ మరియు సర్వే ప్రక్రియపై కీలక చర్చలు జరిగాయి గ్రామంలోని ప్రతి ఎకరా భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించడమే ఈ రీ-సర్వే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు, సర్వే అనంతరం పక్కాగా తాజా పహాణీలను రూపొంది స్తామని, దీనివల్ల భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసిల్దార్ పేర్కొన్నారు, గ్రామ సరిహద్దులతో పాటు, ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని రక్షించేందుకు చర్యలు చేపడతా మని వెల్లడించారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేందర్ నాథ్‌తో పాటు స్థానిక సర్పంచ్ సుగంధ-మాధవరావు పటేల్, ఉపసర్పంచ్ ఫారూఖ్, సర్వేయర్, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు, భూముల రీ-సర్వే ప్రక్రియకు రైతులు, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించి విజయవంతం చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు.

## ప్రతాప్ రెడ్డి పరమేశ్వర్ డ్రిప్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎమ్మెల్యే

ఆలంపూర్ ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి కొన్ని కోట్ల రూపాయల విలువైన పరమేశ్వర్ డ్రిప్ ఫ్యాక్టరీ పూర్తిగా మంటల దాగిద్ధమైంది.ఈ దుర్ఘటన తెలుసుకున్న ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు, అయిజ మండల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వావిలాల రంగారెడ్డి, అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ తక్షణం స్థలానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రతాప్ రెడ్డి ని, కుటుంబ సభ్యులను పరామర్శించి, మంటల్లో దగ్ధమైన ఫ్యాక్టరీని స్వయంగా పరిశీలించారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ, కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు కష్టపడి నిర్మించిన ఈ ఫ్యాక్టరీ మంటలకు బలైపోవడం అతి బాధాకరం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా, అలంపూర్ నియోజకవర్గంలో అగ్నిమాపక ఫైర్ స్టేషన్ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, అధికారులను కోరుతున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

---

## మల్లేశ్వరం కృష్ణానది ప్రాంతంలో వైజాగ్ జలారి అనుమాదాస్పద మృతి!!

**ప్రతి సంవత్సరం కొల్లాపూర్ ప్రాంతంలో ఉన్న కృష్ణా నదిలో ఆంధ్ర జలారులు అనుమాదాస్పద మృతితో శవాలుగా తేలుతున్నారు**

**పని కోసం వలస వచ్చిన ఆంధ్ర జలారిని కొట్టి చంపారా?? లేదా అనారోగ్యంతో చనిపోయాడా తెలియాల్సి ఉంది ?**

**నిషేధిత అలివివ్వలను అరికట్టాల్సిన అధికారులే దళారులతో చేతులు కలుపుతున్నారు అన్న ఆరోపణలు బహిరంగంగా వస్తున్నాయి**



కొల్లాపూర్ ఫిబ్రవరి 21 : (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలో కృష్ణానదిలో నిషేధిత అలివి వలలను లాగడానికి వలస కూలీల పని కోసం వచ్చిన వైజాగ్ ఆంధ్ర జలారి అనుమాదస్పదంగా మల్లేశ్వరం లో ఉన్న కృష్ణనది ఒడ్డున శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందిన విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వైజాగ్ ఆంధ్ర జలారి మృతికి సంబంధించిన పూర్తి వివరాలను పెంట్లవెల్లి మండల ఎస్సై రామన్ గౌడ్ ని పత్రికా జర్నలిస్టు చరవాణి ద్వారా వివరణ కోరగా ఎస్సై రామన్ గౌడు ఫోన్ కట్ చేస్తూ స్పందించలేదు, పోలీస్ ప్రెస్ గ్రూపులో మృతుని ఫోటో ను పత్రికా మిత్రులకు తెలిపాడే తప్ప మృతికి సంబంధించిన పూర్తి వివరాలను చెప్పడానికి నిరాకరించాడు ? శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్ మార్చిరికి పోలీసులు తరలించినట్టు విషయం తెలిసింది.

ఇలా ప్రతి సంవత్సరం కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న అమరగిరి కృష్ణానదిలో అలాగే పెంట్లవెల్లి మండల పరిధిలో ఉన్న మల్లేశ్వరం, మంచాలకట్ట జటప్రోలు కృష్ణానదిలో వలస కూలి పని కోసం వచ్చిన ఆంధ్ర జలారులు అన్యాదస్పద మృతితో శవాలుగా తేలుతున్నారు. ఇంకా ఇతని మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

---

# ఊరూరా బెల్టు జోరు...

## గ్రామాల ప్రశాంతతను భంగం చేస్తున్న అక్రమ మద్యం విక్రయాలు

విజన్ ఆంధ్ర,ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలి కాలంలో అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతుండటంతో గ్రామీణ జీవనం ప్రభావితమవుతోంది. ఒకప్పుడు సాయంత్రం అయ్యే సరికి కుటుంబాలతో గడిపే గ్రామ వీధులు ఇప్పుడు బెల్టు షాపుల వద్ద గుమిగూడే జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ఈ దుకాణాలు గ్రామాల మధ్యలోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

సాయంత్రం పని ముగించుకుని వచ్చే కూలీలు, యువకులు బెల్టు దుకాణాల వద్ద చేరడం రోజువారీ దృశ్యంగా మారింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఈ అక్రమ విక్రయ కేంద్రాలు గ్రామాల్లో మద్యం వినియోగాన్ని పెంచుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల కుటుంబాల్లో గొడవలు పెరగడంతో పాటు ఆర్థిక సమస్యలు తీవ్రమవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా పాఠశాలలు, దేవాలయాల సమీపంలో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది. అనుమతి ఉన్న మద్యం దుకాణాల నుంచి సరఫరా అవుతున్న మద్యం రహస్యంగా గ్రామాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. దీంతో గ్రామాల్లో శాంతిభద్రతలపై కూడా ప్రభావం పడుతోందని ప్రజలు అంటున్నారు.

ఈ అంశంపై బిఆర్ఎస్ నాయకురాలు కుర్ర సావిత్రి స్పందిస్తూ, అక్రమ మద్యం విక్రయాలు మహిళలు, పిల్లల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో శాంతి వాతావరణం కొనసాగాలంటే బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని ఆమె డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇక ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం అక్రమ మద్యం విక్రయాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక దళాలతో దాడులు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు కనిపిస్తే ప్రజలు సమాచారం అందించాలని సూచించారు.

గ్రామాల ప్రశాంతతను కాపాడేందుకు అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. అధికారులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే "ఊరూరా బెల్టు జోరు"కు ముగింపు పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తానూర్ జూనియర్ కళాశాలకు

# రూ. 21 లక్షల నిధులు

-ఎమ్మెల్యే రామారావు పటేల్



తానూర్, ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర): మండల కెంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ, 21 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు, సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద ఈ నిధులు విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు, ముఖ్యంగా కళాశాలలో ఇంటిగ్రేటెడ్ సైన్స్ అండ్ మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటుకు ఈ నిధులను వెచ్చించనున్నట్లు వెల్లడించారు, విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని, ఈ ల్యాబ్ ద్వారా సైన్స్, గణిత శాస్త్రాల్లో విద్యార్థులు ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు, ప్రభుత్వ విద్య బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

యూరియా నో స్టాక్ బోర్డ్ వెలిమినేడు

# పిఏసిఎస్ కార్యాలయానికి తాళం

**-ఆన్ లైన్ లో పెట్టిన ఐదు నిమిషాలకే యూరియా నో స్టాక్**

**-ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల ఆందోళన**



చిట్యాల ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర); చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. పీఏసీఎస్ లో 560 బస్తాల యూరియాను ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచిన ఐదు నిమిషాలకే నో స్టాక్ గా చూపించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం యూరియా స్టాక్ ఆన్ లైన్ నమోదు చేసిన కొద్ది నిమిషాల్లోనే పూర్తిగా అయిపాయిందని సిస్టంలో చూపించారు. అయితే సమీప ప్రాంత రైతులకు కాకుండా ముందుగానే బుక్ చేసుకున్న కొందరికి మాత్రమే యూరియా అందిస్తున్నారని ఆరోపిస్తూ సంఘం కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పీఏసీఎస్ సిబ్బంది ముందుగానే తెలిసిన వారిచే యాప్ లో యూరియా బుకింగ్ చేయించుకుని బ్లాక్ లో అమ్ముకంటున్నారని ఆరోపించారు. ఆన్ లైన్ లో ఉంచిన ఐదు నిమిషాలకే ఎలా అయిపోతాయని, సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన రైతులకు యూరియా అందించాలన్నారు. యాప్ లో 560 బస్తాల యూరియా బుకింగ్ చేసుకున్న రైతుల వివరాలను వెల్లడించాలన్నారు. యూరియా పంపిణీలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా బుకింగ్ యాప్ ను రద్దు చేసి పట్టాదారు పాసు పుస్తకాల ప్రకారం అందిచాలని డిమాండ్ చేశారు.

# శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మొదటగా సంబంధిత జిల్లా స్థాయి అధికారులను బ్రహ్మోత్సవాలకు సంబంధించి గతంలో ఏర్పాట్ల అనుభవాలు ప్రస్తుతం చేస్తున్న ఏర్పాట్ల గురించి శాఖ వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తేది 27.02.2026 నుండి 11.03.2026 వరకు 13 రోజుల పాటు జరగనున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం మరియు ఇతర దేవాలయాల అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేశారని వీటితో పాటు ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధికి మరియు జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేశారాని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, శుద్ధమైన ఆహారం, వైద్యసేవలు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాత్కాలిక వైద్యశిబిరాలు, అంబులెన్స్ సదుపాయాలు 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి వారికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు పారదర్శకంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది నిరంతరం శుభ్రత పనులు చేపట్టాలని కోనేరు వద్ద, గోదావరి పుణ్య స్నానాల వద్ద ప్రధాన ఆలయం వద్ద శానిటేషన్ చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో బ్రహ్మ, సత్యవతి గుండాలు ఉన్నందున భక్తులు పుణ్యస్నానాలు చేసేటప్పుడు లోతు ప్రదేశాలకు వెళ్ళకూడదని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అలాగే 45 మంది గజ ఈతగాళ్ళకు రేడియం తో గల టి - షర్ట్స్ అందుబాటులో ఉంచుతూ 3 షిఫ్ట్ లలో పహారా కాయాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ సిబ్బంది త్రాగు నీరు అవసరం మేరకు భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా 24 గంటలు ఉండే విధంగా చూడాలని, రాత్రి వేళల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని ముందస్తుగా ముందస్తుగా పెద్ద జనరేటర్లు ప్రధాన ఆలయం వద్ద మరియు డోలోత్సవం వద్ద ఏర్పాట్లు చేయాలని అన్నారు. భద్రతా పరంగా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు జగిత్యాల జిల్లా డిపోలతో పాటు ఇతర డిపోలతో సమన్వయం చేసుకుంటూ అదనపు 15 బస్సు సర్వీసులు 24 గంటలు నడిపి భక్తుల రాకపోకలకు సౌలభ్యం కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, రైస్ మిల్లర్లు, వ్యాపారస్తులు, ప్రముఖులు మరియు వక్తకులు ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా ప్రతిరోజు లక్ష మందికి నిత్యన్నదానం, త్రాగునీరు ఏర్పాట్లకు, ఇతర ఏర్పాట్లకు భక్తులకు సేవలందించాలని కోరారు. శాఖల మధ్య సమన్వయం కీలకమని, ప్రతి అధికారి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా, ఆదర్శవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో అన్ని శాఖల అధికారులు స్థానికంగా అందుబాటులో ఉంటూ ఎటువంటి లోపాలు లేకుండా, ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురిలో జరిగే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక వేడుకలని తెలిపారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు హా ఈ సంవత్సరం10% నుండి 20% భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో ఈ నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చలువ పందిర్లు, టెంట్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, అన్నదానాల వద్ద క్యూ లైన్ ల ఏర్పాటు, భక్తులుకు అర్థం అయ్యే విధంగా సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. VIP ల దర్శనానికి ప్రత్యక క్యూ లైన్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న రోజులు LIVE వచ్చేలా LED స్క్రీన్ లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని పోలీస్ శాఖకు సూచించారు. పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి, సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆర్టీసీ అధికారులు జగిత్యాల జిల్లా డిపోలతో పాటు ఇతర డిపోలతో సమన్వయం చేసుకుంటూ అదనపు 15 బస్సు సర్వీసులు 24 గంటలు నడిపి భక్తుల రాకపోకలకు సౌలభ్యం కల్పించాలని కోరారు. 120 మంది స్పెషల్ మున్సిపల్ సిబ్బంది, 20 చలివేంద్రాలు, 4 ట్యాంక్ ల తాగునీరు, 2 మొబైల్ మరుగుదొడ్లు, చెత్తకుండీలు, స్నాన ఘాట్లు, విశ్రాంతి మండపాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని, ప్రధాన ఆలయం, కోనేరు, గోదావరి నది తీర ప్రాంతాల్లో మరియు డ్రైనేజి ల వద్ద 2o2 ట్రాక్టర్లతో శానిటేషన్ చేయాలని, మున్సిపల్ మరియు సంబంధిత శాఖలకు ఆదేశించారు. పారిశుధ్యంపై ఎలాంటి రాజీ పడకూడదని, ప్రతి రోజు పరిశుభ్రత పనులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణకు ప్రత్యేక బృందాలు పనిచేయాలని తెలిపారు. వైద్యశాఖ అధికారులు తాత్కాలిక 5 వైద్య శిబిరాలు 3 షిఫ్టులో ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. 108 అంబులెన్స్ సదుపాయాలు 24 గంటలు నిరంతరం అందుబాటులో ఉండాలని, తాగునీటి నాణ్యతపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని, ప్రధాన ప్రదేశాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులకు తక్షణ స్పందన ఇవ్వాలని తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, క్యూలైన్లను క్రమబద్ధంగా నిర్వహించాలని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా భద్రతా పర్యవేక్షణ పెంచాలని, భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రం మరియు అనౌన్స్మెంట్ సెంటర్ల ఏర్పాటు చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని భక్తులకు సహకారం అందించాలని కోరారు. అగ్నిమాపక శాఖ వారు 1 అగ్నిమాపక వాహనం, ఇతర అత్యవసర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆర్ఁడబి శాఖ వారు 3 రథాల ఫిట్నెస్ పరీక్ష చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంతో పాటు అన్ని ఆలయాల్లో, గోదావరి తీరం వెంట, బస్టాండ్ వద్ద, జాతర మైదానం వద్ద 350 మంది పోలీసులను నియమించి 24 గంటల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతర జరుగుతున్న రోజుల్లో VIP రూట్స్, ప్రధాన ఆలయం, గోదావరి నది దారులు, యాత్రికుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరించుట, ప్రత్యేక మహిళా పోలీసు విభాగం (షీ టీమ్స్ ), పట్టణ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు, పెట్రోలింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్విక్ రెస్పాన్స్ టీమ్, డిజాస్టర్ టీమ్, ఫైర్ మరియు ఫిషరింగ్ వారితో పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుని ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి గోడపత్రికను మరియు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా అధికారులు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వి. నాగలక్ష్మి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం చైర్మన్ జె. రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సి.ఎచ్ లావణ్య, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవస్థానం కమిటీ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన రైతులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సిపిఐ నాయకులు

శంకర్ పల్లి, ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర ) : శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామ శివారులోని పొన్నగుట్ట తాండ గిరిజన రైతులు తమకు ప్రభుత్వం నుండి వచ్చిన అసైన్డ్ భూముల ను ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకొని ఎకరాకు 800 గజాల చొప్పున రైతులకు ఇస్తున్నది. ఒరిజినల్ పట్టాదారులను ప్రభుత్వం వదిలేసి ఎలాంటి సంబంధం లేని వారిని చేర్చి వేరే ఇద్దరినీ చేర్చి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఒరిజినల్ పట్టా పాస్ పుస్తకం పొందిన గిరిజన రైతులకు న్యాయం చేయాలని, సిపిఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొని,గిరిజన రైతులకు న్యాయం చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు,చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం , శంకర్ పల్లి మండల కార్యదర్శి పి సుధీర్, నాయకులు రాజేందర్ గౌడ్, బద్దం శివారెడ్డి, రవి శంకర్ తదితరులు ఉన్నారు.

## చీకోడు గ్రామానికి వైకుంఠ రథం విరాళం అంతిమ యాత్రలకు సౌకర్యం

విజన్ ఆంధ్ర, ముస్తాబాద్ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామంలో అంతిమ యాత్రలకు సౌకర్యం కల్పించేందుకు గ్రామానికి చెందిన దాతలు ముందుకు వచ్చి వైకుంఠ రథం (అంతిమ యాత్ర వాహనం) ఏర్పాటు చేయడానికి విరాళం అందించారు. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు స్మశానవాటిక దూరంగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామానికి చెందిన గూడ సురేందర్ రెడ్డి గారు తమ తండ్రి కీర్తిశేషులు గూడ వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం, అలాగే కరెడ్ల తిరుమల్ రెడ్డి గారు తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు కరెడ్ల గుండమ్మ, ఎల్లారెడ్డి వారి జ్ఞాపకార్థం రూ. 2.50 లక్షల విలువైన వైకుంఠ రథం తయారీకి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా తయారీదారుకు నిధులు అందించగా, సుమారు నెల రోజుల్లో వైకుంఠ రథం గ్రామ ప్రజలకు అందుబాటులోకి రానుంది.గ్రామ ప్రజలకు చివరి మజిలీ కార్యక్రమాల్లో ఇబ్బందులు లేకుండా తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ వైకుంఠ రథాన్ని తయారు చేసి గ్రామానికి అందజేస్తున్నట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొమ్మెనా ఆంజనేయులు మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యను గుర్తించి సేవాభావంతో ముందుకు వచ్చిన దాతల కుటుంబాలను అభినందించారు.అంతిమ సంస్కారాల సమయంలో ఈ వాహనం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల తరపున దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అస రంజిత్, మాజీ ఎంపిటిసి సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



# సర్పంచ్ ఆమెనే.. కానీ సీట్లో భర్తే

### - కోదాడ మండలం భీక్య తండలో వివాదం

కోదాడ, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర): కోదాడ మండలం పరిధిలోని భీక్య తండ గ్రామపంచాయతీలో ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నించే ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన భానోతు ఝూన్సీ స్థానంలో, ఆమె భర్త బానోతు బాలాజీ స్వయంగా సర్పంచ్ కుర్చీలో కూర్చొని అధికార విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. అసలు ఏమైంది?

భీక్య తండ గ్రామానికి సర్పంచ్‌గా భానోతు ఝూన్సీ ప్రజల ఓట్లతో ఎన్నికయ్యారు. అయితే గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారిక సమావేశాలు, పత్రాలపై సంతకాలు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె స్థానంలో భర్త బానోతు బాలాజీ వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ కుర్చీలో కూర్చొని, అధికార వ్యవహారాలను తానే చూసుకుంటున్న బాలాజీని ప్రశ్నించగా ---నా ఇష్టం... నేను కూర్చుంటాను. నన్నెవరు ఏం చేసుకోలేరు" అంటూ సమాధానం ఇచ్చినట్టు సమాచారం.

**-చట్టపరంగా సరైనదేనా?**

గ్రామపంచాయతీ చట్టాల ప్రకారం ప్రజల ఓట్లతో ఎన్నికైన వ్యక్తే అధికారికంగా బాధ్యతలు నిర్వహించాలి. ఇతరులు, ముఖ్యంగా కుటుంబ సభ్యులు, అధికారిక హోదా లేకుండా విధులు నిర్వహించడం చట్ట విరుద్ధం. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్థానికులు ఆగ్రహం



వ్యక్తం చేస్తున్నారు.

**-కలెక్టర్ జోక్యం కోరుతున్న గ్రామస్తులు**

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఓట్ల విలువను కాపాడాలని, మహిళా ప్రజాప్రతినిధుల స్థానాన్ని గౌరవించాలని వారు కోరుతున్నారు.

**-మహిళా రిజర్వేషన్ ఉద్దేశ్యానికి విరుద్ధమా?**

గ్రామ సర్పంచ్ పదవి మహిళలకు రిజర్వ్ చేయబడిన సందర్భంలో, భర్తల పెత్తనం కొనసాగితే మహిళా సాధికారత లక్ష్యం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భీక్య తండ ఘటనతో మరోసారి సర్పంచ్ పతి" వ్యవహారం చర్చకు వచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే అధిపతులు --- కానీ వారి తరపున ఎన్నికైన వ్యక్తులే బాధ్యతలు నిర్వహించాలి అన్నది చట్టస్పష్టం.

# సీ సీ ఐ పత్తి కొనుగోలును పొడగించాలి

కాగజ్ నగర్ ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర) పత్తి కొనుగోలు గడువును మార్చి 15 వరకు పొడిగించాలని కౌటాల మండలంలోని బీఆర్ఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పత్తి చేనులోనే ఉండిపోయిందని, మరికొన్ని చోట్ల కార్మికుల కొరత వల్ల కోత పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికే కోత తీసిన పత్తిని నిల్వ ఉంచుకున్న రైతులు మార్కెట్‌కు తరలించేందుకు తగిన సమయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు గడువు ముగిస్తే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు పత్తి విక్రయించే అవకాశం కల్పించాలంటే సిసిఐ అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు గడువును మార్చి 15 వరకు పొడిగించాలని వారు విజ్ఞప్తి చేశారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా



ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు అదే వసంత్ రావు డోంగ్రి మధుకర్ సర్పంచ్ లు సంతోష్ , మంగక్క, చందు మాజీ సర్పంచ్ లు అదే శ్రీనివాస్, పెద్దపల్లి హనుమంతు, పున్నయ్య, లంచు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌తో గోస పడుతున్నాం

### - యూరియా యాప్ రద్దు చేయాలని రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన..

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21 (విజన్ ఆంధ్ర) యూరియా యాప్ రద్దు చేయాలంటూ వేములపల్లి మండల పలు గ్రామాల రైతులు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేములపల్లి మండలానికి చెందిన రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూరియా యాప్ తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వ్యవసాయం చేయలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు, గతంలో యూరియా కావాలంటే ఫర్టిలైజర్ షాపుల్లో దొరికేదని, ప్రస్తుతం ప్రభుత్వ ప్రవేశపెట్టిన యూరియా యాప్ లో స్టాక్ వివరాలు చూపిస్తున్నప్పటికీ, బుకింగ్ ఓపెన్ చేసేసరికి అయిపోయినట్లు చూపిస్తూ యూరియా బుక్కు కాకపోవడంతో రైతులు



అయోమయానికి గురవుతున్నారని, గతంలో లేని ఇబ్బంది ఇప్పుడే ఎందుకని ఇప్పుడే ఎందుకు ఉత్తరమైందో ప్రభుత్వాల గ్రహించి, రైతుల పట్ల చిత్తశుద్ధితో యూరియా యాప్ ను తొలగించి పాత పద్ధతిలోనే రైతులకు కావలసిన యూరియాను అందించాలని కోరారు, ఈ కార్యక్రమంలో రైతులు గుండెబోయిన మల్లయ్య,, జడ మట్టయ్య, చిర్ర కార్తీక్, జడ లింగయ్య, తంగళ్ళ సతీష్ తదితర రైతులు పాల్గొన్నారు.

# కిమ్స్ ఆస్పత్రిలో మానసిక వైద్య సదస్సు

చిట్యాల ఫిబ్రవరి 21(విజన్ ఆంధ్ర); నార్కట్ పల్లి కామినేవి వైద్య విజ్ఞాన సంస్థ లోని మానసిక వైద్య 9 విభాగం అద్వర్యంలో 21 ఫిబ్రవరి నాడు "ప్రవర్తనా వ్యసనాలు " మీద రాష్ట్రస్థాయి మానసిక వైద్య సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మానిసిక వైద్య విభాగం హెచ్.వో.డి. డా.వి. విశ్వక రెడ్డి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలలో స్మార్ట్ ఫోన్ ఉపయాగం సర్వసాధారనమైనది. కాని ఎక్కువ శాతం యువత తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వలన స్మార్ట్ ఫోన్‌ని దుర్వినియోగం చేయడం జరుగుతున్నదనీ స్మార్ట్ ఫోన్ దుర్వినియోగం వల్ల యువత సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ జూదం,డేటింగ్ ఆప్స్, ఆన్లైన్ షాపింగ్ లాంటి ప్రవర్తనా వ్యసనాలకు అధికశాతంలో భావిసలు అవుతున్నారని రాష్ట్రంలోని ప్రముఖ సైకియాట్రిస్ట్‌ల ద్వారా ప్రవర్తనా వ్యసనాల యొక్క కారకాలు, మానసక లక్షణాలు, వైద్య మార్గాలు, నివారణ చర్యల గురించి ఇతర వైద్యులకి, వైద్య విద్యార్థులకి అవగాహన కల్పించడానికి ఈ సదస్సు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామినేని వైద్య విజ్ఞాన సంస్థ ప్రిన్సిపాల్ డా. బి.ఎస్. లక్ష్మణ్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్స్ డా. రంగారావు, డా. సతీష్, సూపరింటెండెంట్ డా. రామ్ మోహన్. మానిసిక వైద్యులు డా. స్రవంతి, డా. దరణీధర్, డా. నాగరజిత, డా. సాయికృష్ణ, 150 మంది ఇతర వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.